Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 286 పేజీలు 8 వెల : 5 గురువారం 16 ఏప్రిల్ 2026







# టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లోకేశ్

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా కొనసాగింపు

ఇద్దరు క్షేత్రస్థాయి నేతలకు పొలిట్ బ్యూరోలో స్థానం

పార్టీ కార్యవర్గాన్ని పునర్నిర్మించిన చంద్రబాబు



అమరావతి: టిడిపి కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మంత్రి నారా లోకేశ్‌ను ప్రకటించింది. పార్టీకి ఇప్పటి వరకు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న లోకేశ్ ఓ రకంగా ప్రమోషన్ పొందారు. మెల్లగా ఆయన చంద్రబాబుకు ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నారు. ఇప్పటికే పార్టీలో అంతా తానై నడిపిస్తున్నారు. ఇకపోతే తెదేపా ఏపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ కొనసాగనున్నారు. పొలిటిబ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ఈ మేరకు పార్టీ ప్రకటించింది. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శులుగా రామ్మోహన్ నాయుడు, బైరెడ్డి శబరి, రాజేశ్ కిలార్‌లను పార్టీ నియమించింది. సీనియర్లకు గౌరవమిస్తూ.. కొత్తవారికి అవకాశాలు కల్పిస్తూ.. సామాజిక కోణంలో నూతన కమిటీల కూర్పు జరిగింది. విధేయత, కష్టపడే తత్వం, అనుభవం లెక్కించి అధిష్ఠానం పదవులు ఇచ్చింది. నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు రాని వారికి పార్టీ పదవుల ద్వారా న్యాయం కల్పించింది. అన్ని సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పుపై పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కసరత్తు చేశారు. 29 మందితో పొలిట్ బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీ కూర్పు చేశారు.

జాతీయ ప్రధాన కార్యదర్శులు–3, జాతీయ ఉపాధ్యక్షులు–18, జాతీయ అధికార ప్రతినిధులు–10 రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు–7, రాష్ట్ర ఉపాధ్యక్షులు–16, రాష్ట్ర అధికార ప్రతినిధులు–14, రాష్ట్ర జోనల్ కో–ఆర్డినేటర్లు–10, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు–59, రాష్ట్ర కార్యదర్శులు–77 తో పునర్నిర్మించారు.

ఓ మండల పార్టీ అధ్యక్షురాలికి, ఓ క్లస్టర్ ఇన్ఛార్జికి నేరుగా పొలిట్ బ్యూరోలో చోటు కల్పిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్టీ అత్యున్నత స్థాయి కమిటీ పొలిట్ బ్యూరోలో చోటు దక్కించుకున్న గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గుత్తికొండ ధనుంజయ్ అత్యున్నత స్థాయికి ఎదిగారు.

రాష్ట్ర కమిటీలోని 185 మందికి గానూ... 50 మంది మహిళలకు చోటు, పొలిట్ బ్యూరో, జాతీయ కమిటీల్లోనూ మహిళలకు సముచిత స్థానం కల్పించారు. జనాభా దామాషా పద్ధతిన, సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పు చేశారు. 185 మంది రాష్ట్ర కమిటీ సభ్యుల్లో 122 మంది బడుగులకు స్థానం కల్పించింది. బీసీ–77, ఎస్సీ–25, ఎస్టీ–7, మైనార్టీ–13 మందికి రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని కోణాల్లో విశ్లేషించి చంద్రబాబు కమిటీల కూర్పు చేపట్టినట్లు అర్థంఅ వుతోంది.



# పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కృషి

తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేయడం నా అదృష్టం

కార్యకర్తల సంక్షేమం కోసం నిరంతరంగా పాటుపడతా

చంద్రగిరి నా జీవితంలో టర్నింగ్ పాయింట్

'యువగళం పాదయాత్రలో చంద్రగిరి నాకు టర్నింగ్ పాయింట్. ఈ రోజు ఇక్కడే నా రాజకీయ పదోన్నతికి సంబంధించిన శుభవార్త విన్నాను. అందుకే చంద్రగిరి మాకు అచ్చివచ్చిన నియోజకవర్గం. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే అధినేత. ఇటీవల పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున సీఎం చంద్రబాబు పక్కన సామాన్య కార్యకర్తలు కూర్చున్నారు. కార్యకర్తల కోసం సుమారు రూ.150 కోట్ల బీమా సొమ్ము వెచ్చించాం. గత ప్రభుత్వంలో కేడర్‌పై పెట్టిన తప్పుడు కేసులన్నీ ఎత్తేస్తాం.

2లో..

# ఎపి ఇంటర్ ఫలితాలు విడుదల

మొదటి సంవత్సరంలో 77 శాతం

రెండో సంవత్సరంలో విద్యార్థులు 81 శాతం పాస్

ఫలితాల్లో అమ్మాయిలదే హవా

ప్రభుత్వ, ప్రభుత్వ ఆధీన కళాశాలల్లో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయి. గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం 54 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరం జీజేసీల్లో 68 శాతం పాస్ అయ్యారు. ఇది గత 12 ఏళ్లలో అత్యధిక ఉత్తీర్ణతగా నమోదు అయింది.





## మార్కెట్ యార్డ్ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు



## మహిళా బిల్లుకు ఓకే

డీలిమిటేషన్ బిల్లుకు నో

వ్యతిరేకంగా ఓటేస్తామన్న ఖర్గే

# పునర్విభజన జనాభా ప్రకారమే



రాజ్యాంగం నిర్దేశించింది కూడా ఇదే

సీఎం రేవంత్ గందరగోళ వ్యాఖ్యలు తగవు

బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

వరంగల్: నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే అసత్య ప్రచారానికి తెరలేపారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. బుధవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన పక్రియ అని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. సీట్ల పెంపు అనేది 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుంది. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల్లో గందరగోళం సృష్టించేలా మాట్లాడుతూ రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ సిస్టమ్' అనే విధానం ప్రపంచంలోనే ఎక్కడా లేదని రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి చెబుతున్న ప్రతిపాదనలు అసంబద్ధంగా ఉన్నాయని, అవేవీ చట్టబద్ధమైనవి కావని ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇండియా కూటమి, కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని ధ్వజమెత్తారు. నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదు. సీఎం రేవంత్ రెడ్డి తన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని రాంచందర్‌రావు అన్నారు. దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ పక్రియపై చర్చ జరుగుతున్న వేళ, రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు కేవలం కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లడానికేనని రాంచందర్‌రావు విమర్శించారు. పునర్విభజన పక్రియ చట్టప్రకారం పారదర్శకంగా జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.



# తెలంగాలో భగ్గుమంటున్న భానుడు

పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నమైతే చాలు భానుడు భగ్గుమంటున్నాడు. దాంతో వాతావరణ కేంద్రం హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారిచేసింది. ఆరెంజ్ అలర్ట్ జారీచేయబడిన జిల్లాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి ఉన్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇవాళ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొంది. నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. వడగాలులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీచేసింది.

# పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ

ఆందోళనకు దిగిన జాగృతి అధ్యక్షురాలు కవిత



వికారాబాద్: వికారాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్టు చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతుల భూములను బలవంతంగా సేకరిస్తున్నారని ఆరోపిస్తూ ఉదయం నుంచి కవిత ఆందోళన చేశారు. ఈ క్రమంలోనే రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో రైతుల పొట్ట కొడుతోందని ఆమె ఆరోపించారు. భూసేకరణ ఆపకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామన్నారు. తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీలు రైతులకు సంఘీభావం తెలిపాయి.

# జనాభా ప్రకారం ఆలోచిస్తే నష్టమే



2లో

## పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కృషి

తిరుపతి: తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తనను ఎంపిక చేయటాన్ని అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి నారా లోకేశ్ అన్నారు. పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కష్టపడతానని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. బుధవారం చంద్రగిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన యువనేత లోకేశ్ తొలిసారిగా తమ ప్రాంతానికి రావడంతో చంద్రగిరి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఆయనను ముంచెత్తారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. 'ప్రత్యర్థులు బెదిరించినా భయపడకుండా తొడగొట్టి ఎన్నికల బరిలో నిలబడిన అంజిరెడ్డి తాత.. ప్రాణం పోతున్నా ప్రత్యర్థి పేరు తన నోట పలకని తోట చంద్రయ్య.. రక్తమోడుతున్నా పోలింగ్ బూతులో కూర్చున్న మంజులారెడ్డి నాకు స్ఫూర్తి. మీ అందరి త్యాగాల వల్లే 94 శాతం సీట్లతో ఈ రోజు మేమంతా ఇక్కడ కూర్చున్నాం. ప్రజలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి, ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలుం టాయని పాదయాత్రలో చెప్పా.. అదే ఇప్పుడు చేస్తున్నాం. మేం వారి మాదిరిగా రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేయడం లేదని అన్నారు. అభంశుభం తెలియని అమర్నాథ్ గౌడ్, అబ్దుల్ సలాం, తోట చంద్రయ్య వంటి వారిని నిర్దాక్షిణ్యంగా పొట్టనబెట్టుకున్నారు. దోషులపై చట్టపరిధిలో చర్యలు తీసుకుంటున్నాం. మూడు రోజుల క్రితం దేవాలయానికి అడ్డుగా ఉన్న కారు తీయమని చెప్పినందుకు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మనుషులు భక్తులపై దాడిచేశారు. భక్తులపై దాడిచేస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. అటువంటి దుశ్చర్యకు పాల్పడేవారిని వదిలిపెట్టే ప్రసక్తిలేదని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తన రాజకీయ జీవితాన్ని చంద్రగిరి నుంచే ప్రారంభించారు' అని అన్నారు. 'యువగళం పాదయాత్రలో చంద్రగిరి నాకు టర్నింగ్ పాయింట్. ఈ రోజు ఇక్కడే నా రాజకీయ పదోన్నతికి సంబంధించిన శుభవార్త విన్నాను. అందుకే చంద్రగిరి మాకు అచ్చివచ్చిన నియోజకవర్గం. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే అధినేత. ఇటీవల పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున సీఎం చంద్రబాబు పక్కన సామాన్య కార్యకర్తలు కూర్చున్నారు. కార్యకర్తల కోసం సుమారు రూ.150 కోట్ల బీమా సొమ్ము వెచ్చించాం. గత ప్రభుత్వంలో కేడర్‌పై పెట్టిన తప్పుడు కేసులన్నీ ఎత్తేస్తాం. గతంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు చాలా వరకు క్లియర్ చేశాం. మిగిలినవి కూడా త్వరలో విడుదల చేస్తాం. కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసే బాధ్యత మేం తీసుకుంటాం. కోటిమంది సభ్యులు గల అతిపెద్ద కుటుంబం తెలుగుదేశం అని అన్నారు. ఇంత పెద్ద కుటుంబంలో చిన్నచిన్న సమస్యలు సహజం. నమ్మిన సిద్ధాంతం కోసం కేడర్ కలసికట్టుగా కష్టపడి పనిచేయాలి. అలిగి ఇంట్లో పడుకుంటే నష్టపోయేది మనమే. అధునాతన టెక్నాలజీతో ప్రతి కార్యకర్త చేసే పనిని ట్రాక్ చేస్తున్నాం. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తను 'మై టీడీపీ యాప్' ద్వారా గుర్తించి, సముచిత స్థానం కల్పిస్తాం. చంద్రగిరి చెవిలో పువ్వుగా పేరొందిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని జగనే నమ్మడం లేదు. ఆయన చేతివాటం జగన్‌కు అర్థమైంది. మద్యంలో 600 కోట్లు కొట్టేశాడు. దేవుడి లడ్డూలు, వస్త్రాలను సైతం అమ్ముకున్నాడు. అటువంటి అవినీతిపరుడి నుంచి చంద్రగిరి ప్రజలకు విముక్తి లభించింది. ఎమ్మెల్యే పులివర్తి నాని నియోజకవర్గంలో పనుల కోసం మా వెంట పడుతుంటారు. గత 22 నెలల్లో నియోజకవర్గంలో రూ.900 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. చంద్రగిరికి పరిశ్రమలు తెచ్చే బాధ్యత నాది. చిన్నచిన్న సమస్యలను పక్కనబెట్టి టీడీపీ, జనసేన, బీజేపీ కేడర్ కలసికట్టుగా ప్రత్యర్థులపై పోరాడాలని అన్నారు.

## మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

హైదరాబాద్: తెలంగాణలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి, పారదర్శకతపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన అధికారులతో చర్చించారు. గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రికి అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదిక సమర్పించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం చేయకుండా లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. అలాంటి వారికి సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పంట ఉత్పత్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు తుమ్మల. గడ్డిఅన్నారం మార్కెట్‌లో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' అమలు చేయాలని, డిజిటలైజేషన్ ద్వారా జీరో బిజినెస్ సమస్యను తగ్గించాలని నిర్ణయించారు. కోహెడ మార్కెట్ అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ ఖర్చు తగ్గింపుపైనా మంత్రి దృష్టి సారించారు. మార్కెట్ యార్డుల్లో సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేసి, జులై చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని అన్నారు. వ్యవసాయ కొనుగోళ్ల విషయానికి వస్తే.. ఖరీఫ్ సీజన్‌లో పత్తి కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లకు మిర్చి అధికంగా వస్తోందని పేర్కొన్నారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. టార్పాలిన్లు, తేమ కొలమానాలు, డ్రైయర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోళ్లలోనూ రైతులకు పూర్తి రక్షణ కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అలాగే రైతుల ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తామని స్పష్టం చేశారు. మొత్తం మీద మార్కెట్ యార్డ్‌లను ఆధునీకరించి, రైతులకు అనుకూలంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల వెల్లడించారు.

## డీలిమిటేషన్ కేవలం రాజకీయ సవరణగా మిగలొద్దు

హైదరాబాద్ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డీలిమిటేషన్ జరిగితే అది కేవలం ఒక రాజకీయ పక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదని అన్నారు. మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తేల్చి చెప్పారు. మూడేళ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు.

తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని కేటీఆర్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణతో పాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది.

# ఎపి ఇంటర్ ఫలితాలు విడుదల



అమరావతి,ఏప్రిల్15(ఆర్ఎన్ఎ): ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం ఉదయం మంత్రి నారా లోకేశ్ ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో రికార్డు స్థాయిలో ఉత్తీర్ణత నమోదు అయ్యింది. గత 12 ఏళ్లలో అత్యధికంగా మొదటి సంవత్సరం విద్యార్థులు 77 శాతం పాస్ అయ్యారు. రెండో సంవత్సరం విద్యార్థులు 81 శాతం పాస్‌తో రెండో అత్యుత్తమ ఫలితాలను సాధించారు. విద్యార్థులు తమ ఫలితాలనువెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. మెసేజ్‌ను 9552300009 నంబర్‌కు వాట్సాప్‌లో పంపితే కూడా ఫలితాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ, ప్రభుత్వ ఆధీన కళాశాలల్లో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయి. గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం 54 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరం జీజేసీల్లో 68 శాతం పాస్ అయ్యారు. ఇది గత 12 ఏళ్లలో అత్యధిక ఉత్తీర్ణతగా నమోదు అయింది. విద్యార్థులు, ప్రిన్సిపల్స్, లెక్చరర్ల సమిష్టి కృషి వల్లే ఈ ఫలితాలు వచ్చాయని అధికారులు తెలిపారు. అకడమిక్ ఎక్సలెన్స్ కోసం అందరూ కలిసి కృషి చేయడం ఫలించిందని ప్రశంసించారు. ఇంటర్ ఫలితాల్లో అబ్బాయిల కంటే అమ్మాయిలు మెరుగైన ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం అమ్మాయిల పాస్ శాతం 85శాతంగా నమోదయ్యింది. ప్రథమ సంవత్సరం అమ్మాయిల పాస్ శాతం 81శాతంగా నమోదు అయ్యింది. రీకౌంటింగ్ / రీవెరిఫికేషన్ దరఖాస్తులలను ఏప్రిల్ 20 నుంచి 27 వరకు

వరకు స్వీకరిస్తారు.

స్కాన్ కాపీతో రీవెరిఫికేషన్‌కు అవకాశం ఉంది. సప్లిమెంటరీ పరీక్షలు మే 21 నుంచి జూన్ 4 వరకు థియరీ పరీక్షలు, జూన్ 7 నుంచి 11 వరకు ప్రాక్టికల్స్ రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ ఉంటుంది. మొదటి సంవత్సరం పాస్ అయిన వారికి ఇంప్రూవ్‌మెంట్‌కు ఛాన్స్ ఉంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పూర్తి పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశ చెందవద్దని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. తిరిగి కృషి చేసి విజయం సాధించాలని వారికి పిలుపు ఇచ్చారు. ఈ సమయంలో తల్లిదండ్రులు విద్యార్థులకు మానసిక బలం ఇవ్వాలని, భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని విజయాలు సాధించాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

# మహిళా బిల్లుకు ఓకే



న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్.. డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తామని ప్రకటించింది. కాగా, దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ రెండు బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ అయింది.

ఈ క్రమంలో పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు, బిల్లులకు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బుధవారంఢిల్లీలోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో భేటీ అయ్యింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో కూటమి నేతలు వివిధ అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లపై అనాడైనా ఇనాడైనా కాంగ్రెస్‌ది ఒకటే స్టాండ్ అని పేర్కొన్నారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న ట్రిక్కులకు వ్యతిరేకమని.. మహిళా రిజర్వేషన్లు అంటూ దొంగ దారిలో డీలిమిటేషన్ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని కాంగ్రెస్ పార్టీ వైఖరిని తెలియజేశారు. డీలిమిటేషన్‌పై ఇండియా కూటమి పార్టీలు ఏకతాటిపై ఉన్నాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశ పెడుతోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ లో సమిష్టిగా పోరాడుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి అనుకూలంగానే ఉందని.. కానీ దానిని తీసుకువచ్చే విధానంపైనే అభ్యంతరాలు ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగం లోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా తామంతా పార్లమెంట్‌లో ఐక్యంగా పోరాడుతామని ఖర్గే పేర్కొన్నారు.

కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య (550)ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

# మహిళాబిల్లు, పునర్విభజన చట్టం



### రెంటికీ లింకుపై విపక్షాల ఆందోళన

### పార్లమెంట్‌లో జరిగే చర్చతో తేలనున్న విషయం

న్యూఢిల్లీ: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి, నియోజకవర్గాల పునర్విభజనకు లింకు పెట్టడం ఎందుకని ప్రభుత్వాన్ని విపక్ష రాజకీయ పార్టీలు నిలదీస్తున్నాయి. ఇందులో కుట్ర కోణం దాగివుందని అంటున్నాయి. నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ఇప్పటికే దీనిపై అనేక కోణాల్లో విమర్శలు వస్తున్నాయి. దక్షిణాదికి అన్యాయం జరగబోతోందని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు సిఎం స్టాలిన్ తదితరులు ఆరోపిస్తున్నారు. ఈ రెంటిని కలపడంపైనా మండిపడు తున్నారు. అలాగే ఇదే విషయమై సామాజిక ఉద్యమకారులు ప్రశ్నించారు. కేంద్రం ఎంపీలకు పంపిణీ

చేసిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై వివిధ పక్షాలకు చెందిన నాయకులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లులో మొత్తం లోక్‌సభ స్థానాలను గరిష్ఠంగా 850కి పెంచాలని ప్రతిపాదించినప్పటికీ వాటిని రాష్ట్రాల వారీగా ఏ ప్రాతిపాదికన అమలు చేస్తారన్న దానిపై స్పష్టత ఇవ్వకపోవడాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అనధికారికంగా చెప్పినట్లు ఇప్పుడున్న సీట్లను 50శాతం పెంచితే అన్ని రాష్ట్రాల్లోనూ ఆ వాటా ప్రకారం పెరుగుతాయి. అలాకాకుండా ప్రస్తుతం అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం... అంటే 2011 జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని నియోజకవర్గాలను పునర్విభజిస్తే కుటుంబ నియంత్రణ అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంటుందని వాదిస్తున్నారు. ఇది ఆందోళనకరంగా కనిపిస్తోందని దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు పలువురు పేర్కొంటున్నారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలంటే నియోజవర్గాల పునర్విభజన చేయకతప్పదన్న అభిప్రాయాన్ని తప్పుపట్టారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో ప్రస్తుతం ఉన్న స్థానాల సంఖ్యకు అనుగుణంగానే మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేశారు. ఈ అంశంపై విస్తృతంగా చర్చలు జరపాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నారు. ఇందుకు సంబంధించిన బిల్లు ముసాయిదా ప్రతులను ఇంతవరకు ఎంపీలకు ఇవ్వకపోవడాన్ని, ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడాన్ని ప్రశ్నించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న సీట్లను 543 నుంచి 850 వరకు పెంచాల్సిన అవసరం ఏముందని నిలదీస్తున్నారు. లోక్‌సభ సీట్లను 850కి పెంచితే అది ప్రపంచంలోనే అతి భారీ చట్ట సభ అవుతుందని అన్నారు. అది సభాకార్యకలాపాల నిర్వహణపై ప్రభావం చూపుతుందని తెలిపారు. గతంలో సభ ఏడాదిలో 150 రోజుల పాటు సభ జరిగేదని ఇప్పుడు 55 రోజులపాటు కూడా జరగడం లేదని గుర్తు చేశారు. రిజర్వేషన్లలో ఓబీసీలకు ఉప కోటా లేకపోవడాన్ని కొందరు ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లలో కూడా రిజర్వేషన్ల గురించి అప్పుడే చర్చ మొదలయ్యింది. మొత్తంగా ఈ విషయంలో పార్లమెంటులో చర్చ జరిగితే తప్ప సరైన సమాధానం రాదు. అయితే 2011 జనాభా లెక్కల ప్రకారం అయితే పునర్విభజన పక్కన పెట్టాలని అంటున్నారు.

## దేశానికి దిశ చూపేలా బిల్లులపై చర్చించాలి !

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై పలు విమర్శలు వస్తున్నాయి. పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయ పార్టీలతో పాటు, పౌరసమాజంలోనూ అనుమానాలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి పార్లమెంట్ మూడు రోజుల పాటు ప్రత్యేకంగా సమావేశం కాబోతున్నది. అందువల్ల ఈ విషయంలో అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉంది. అనుమానాలు వ్యక్తం చేస్తున్న వారు, ఆందోళనలు చేస్తున్న వారు, విమర్శలు చేస్తున్న వారి అభిప్రాయాలకు విలువనివ్వాలి. పార్లమెంట్ వేదికగా సుదీర్ఘంగా చర్చించాలి. విపక్ష, స్వపక్ష నేతలు కూడా పరస్పర వివాదాల జోలికి పోకుండా ప్రజలకు అర్థమయ్యేలా సమగ్రంగా చర్చించాలి. అఖిలపక్ష సమావేశం కన్నా పార్లమెంటులో చర్చించడమే మేలు. ఎందుకంటే ఈ చర్చకు చట్టబద్ధత ఉంటుంది. అలాగే సభ్యుల సూచనలు, సలహాలకు విలువ ఉంటుంది. ఎఐ వినియోగం, సాంకేతికత పెరిగిన ప్రస్తుత కాలంలో ఈ విషయాలపై వాటి సాయం కూడా పొందితే మంచిది. పార్టమెంటులో సుదీర్గ ఉపన్యాసాలకు తావులేకుండా, పరస్పర విమర్శలకు చోటు లేకుండా ఈ రెండు అంశాలపై సమగ్రంగా చర్చించాలి. దీనివల్ల ప్రజలకు కూడా అవగాహ కలిగేలా ఉండాలి. రాజకీయపార్టీలు స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి, ఈ అంశాలపై ఓ ఏకాభిప్రాయం వచ్చేలా చూడాలి. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ బిల్లు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది. నిజానికి మొన్నటి సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంట్ ముందుకు వచ్చింది. అప్పుడే ఇది చట్టంగా మారివుంటే బాగుండేది. కొత్తగా జనాభా లెక్కల తరవాత దీనిని అమలు చేస్తామని గతంలో బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం అమలు చేస్తే అన్యాయం చేసినట్లు అవుతుంది. 2029లో సార్వత్రిక ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం మరింతగా వికసిస్తుందని, బలోపేతం అవుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. విధాన నిర్ణయాల్లో మహిళలు ఎప్పుడైతే క్రియాశీలంగా వ్యవహరిస్తారో అప్పుడు వికసిత్ భారత్ దిశగా ప్రయాణం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్న నేపథ్యంలో దేశంలోని మహిళలకు ప్రధాని ప్రత్యేకంగా లేఖ రాశారు. నిజానికి ఇప్పటికే మహిళల రిజర్వేషన్లు అమలు జరిగివుండాల్సింది. అనేక రంగాల్లో మహిళలు రాణిస్తున్నందున చట్టసభల్లోనూ వారి భాగస్వామ్యం పెరగాల్సిందే. చట్టసభల్లో వారి వాణి బలంగా వినిపిస్తే ప్రజాసామ్యం మరింత బలోపేతం అవుతుంది. అయితే లోక్‌సభ సీట్లు పెరిగితేనే మహిళల రిజర్వేషన్లు అమలు సులువవుతందని ప్రభుత్వ వాదనగా ఉంది. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య 550ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2027 జనాభా లెక్కల నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ అందుకు సంబంధించి లెక్కలు వెలువడటానికి ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతోనే ముందస్తు గా ఈ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకొస్తున్నట్లు కేంద ప్రభుత్వం పేర్కొంది. దాని ప్రకారం వెళ్తే ప్రజాస్వామ్య పక్రియలో మహిళా భాగస్వామ్యం పెంచడంలో జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం ఏ జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనేదీ ఈ బిల్లులో చెప్పలేదు. అయితే డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన బిల్లులో ఆ కమిషన్ ఏర్పాటయ్యే నాటికి అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను పునర్విభజించనున్నట్లు పేర్కొంది. అంటే దాని ప్రకారం ప్రస్తుతం అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కలు 2011వే కాబట్టి వాటి ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశముంది. 850 సీట్లను ఏ ప్రాతిపదికన పెంచబోయేదీ ఈ బిల్లులో స్పష్టత ఇవ్వకున్నా పార్లమెంటులో చర్చ సందర్భంగా ప్రభుత్వం చెప్పే అవకాశం ఉంది. అప్పుడు అన్ని రాష్ట్రాల్లో స్థానాలను 50శాతం పెంచుతామని చెబితే ఏయే రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు ఎన్ని పెరుగుతాయన్న దానిపై స్పష్టత వస్తుంది. ఆ రాష్ట్రాలకు వచ్చిన సీట్లను అంతర్గతంగా పునర్విభజించుకోవడానికి 2011 జనాభా లెక్కలు పనికొస్తాయి. అలా కాకుండా దేశం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని 2011 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన చేపట్టాలని నిర్ణయిస్తే డీలిమిటేషన్ కమిషన్ అంతిమంగా నివేదిక ఇచ్చేంత వరకూ ఏ రాష్ట్రం లో ఎన్ని సీట్లు పెరుగుతాయన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కమిషన్‌కు సహాయ పడటానికి ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని నియమిస్తారు. ఇందులో ఐదుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలుంటారు. లోక్‌సభ సభ్యులను లోక్‌సభ స్పీకర్, ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేస్తారు. నియోజకవర్గాల పునర్విభజన కోసం రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్, సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా, వారి నామినీలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను, భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉన్న నిపుణులను, ఇతరత్రా అవసరమైన వారిని పిలిచి మాట్లాడే అధికారం ఈ కమిషన్‌కు ఉంటుంది. కమిషన్ సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడితే మెజారిటీ సభ్యుల అభిప్రాయం చెల్లుబాటవుతుంది. డీలిమిటేషన్ బిల్లులో ఈ కమిషన్ ఏర్పాటు కావడానికి ముందు అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజక వర్గాల పునర్విభజన జరుగుతుందని చెప్పింది తప్పితే స్పష్టంగా ఫలానా జనాభా లెక్కల ప్రాతిపదికన అని చెప్పలేదు. 2027 జనాభా లెక్కల సేకరణ జరుగుతున్న తరుణంలో 2011 జనాభా లెక్కలను ఎలా ప్రాతిపదికగా తీసుకుంటారని ప్రతిపక్షాలు ప్రశ్నించే వీలుండటంతో ఆ దాడి నుంచి తప్పించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తెలివిగా కమిషన్ ఏర్పాటయ్యే నాటికి ముందున్న జనాభా లెక్కల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పినట్లు కనిపిస్తోంది. అయితే ఇవన్నీ ఓక పజిల్‌లలాగా కనిపిస్తున్నాయి. అందువల్ల పార్లమెంట్ చర్చకు విలువ ఉంటుంది. అఖిలపక్షం కన్నా పార్లమెంటులో చేస చర్చలకే ప్రాధాన్యం ఉంటుంది. విపక్షాలకు ఉన్న అనుమానాలను తీర్చాల్సిన బాధ్యత అధికార పక్షానిది.

# రైతులకు భూరీసర్వే పై అవగాహన

**బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి**



: మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామంలో బుధవారం రైతులకు భూరీసర్వేపై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు.తాసిల్దార్ నాగమణి,మాట్లాడుతూ రైతులకు భూరీసర్వే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు.రైతులు తమ భూమి వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని సూచించారు భూముల వివరాలు రికార్డులలో ఉండటం వలన భవిష్యత్తులో భూ వివాదాలను నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోఆర్ఎస్ డ్యూటీ మహేశ్వర్ రెడ్డి,వీఆర్వో రాంగోపాల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రేణిగుంట గ్రామసభ వెలవెలబోవడంపై ఎం.జి. రెడ్డి అసహనం...

గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరమని పిలుపు...

**రేణిగుంట ఉత్తేజిత ఏప్రిల్ 15.**



రేణిగుంట గ్రామపంచాయతీ పరిధిలో నిన్న నిర్వహించిన గ్రామసభకు ప్రజల హాజరు చాలా తక్కువగా ఉండటం పట్ల యువ నాయకుడు ఎం.జి. రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. యువ నాయకులు ఎంజీ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలు చర్చించే గ్రామసభకు ప్రజలు రాకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసే పరిస్థితి అని పేర్కొన్నారు. గ్రామసభ అనేది ప్రతి గ్రామస్థుడి హక్కు మాత్రమే కాకుండా బాధ్యత కూడా అని, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటివన్నీ ఈ వేదిక ద్వారానే జరుగుతాయని ఆయన గుర్తు చేశారు.

?ప్రజలు హాజరు కాకపోవడానికి ప్రధానంగా అవగాహన లోపమే కారణమని, గ్రామసభ ప్రాముఖ్యతపై ప్రజల్లో విస్తృత చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామసభ తేదీ, సమయం గురించి ప్రతి ఇంటికీ ముందుగానే స్పష్టమైన సమాచారం అందించడంలో అధికారులు తమ బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. అలాగే, గ్రామాభివృద్ధి కోసం ముందుండి నడిపించాల్సిన మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు కూడా ఈ సభకు గైర్హాజరు కావడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలకు మార్గదర్శకులుగా ఉండాల్సిన వారు ఇలాంటి కీలక సమావేశాలకు దూరంగా ఉండటం సరైన పద్ధతి కాదని హితవు పలికారు.

?భవిష్యత్తులో అధికారులు, మీడియా, నాయకులు అందరూ సమన్వయంతో పనిచేసి గ్రామసభలను విజయవంతం చేయాలని ఎం.జి. రెడ్డి పిలుపునిచ్చారు. ఇకపై జరిగే గ్రామసభలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ గ్రామ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# చలివేంద్రం ప్రారంభం

## ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యం




**రేణిగుంట, ఉత్తేజిత ఏప్రిల్ 15:**

ఎండలు మండిపోతున్న నేపథ్యంలో బాటసారుల, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు రేణిగుంట రూరల్ పోలీసు శాఖ ముందుకు వచ్చింది. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో బుధవారం సాయంత్రం రేణిగుంట కె.ఎల్.ఎమ్ సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.

రేణిగుంట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మంజునాథ్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ ఎస్ హరీష చలివేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంజునాథ్ రెడ్డి మాట్లాడుతూ, వేసవి కాలంలో ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండాలని, ముఖ్యంగా ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జగదీష్,శారద, పోలీసు సిబ్బంది స్థానిక యువకులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం... గిత్త, గౌరు.



**ఉత్తేజిత ప్రతినిధి...నందికొట్కూర్**

ఏప్రిల్ 15. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ప్రవేశపెట్టిందని నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య, పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డి బుధవారం అన్నారు. మండలంలోని బ్రాహ్మణ కొట్టుకూరు గ్రామానికి చెందిన షేక్ షాజిదాబి అనే మహిళకు సీఎం ఎఫ్ ఆర్ క్రింద మంజూరైన రూ 36, 995 ల చెక్కును బ్రాహ్మణ కొట్కూర్ లోని గౌర వెంకటరెడ్డి స్వగృహంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖలీల్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# టాటా కంపెనీ మరో ఝలక్..




టాటా మోటార్స్ మరో కీలక ప్రకటన చేసింది. ఇప్పటికే కార్ల ధరలు పెంచుతున్నామని ప్రకటించిన టాటా కంపెనీ లారీలు, ట్రక్కుల వంటి కమర్షియల్ వాహనాల ధరలనూ పెంచనున్నట్లు తెలిపింది. వాణిజ్య వాహనాల ధరలు భారీగా పెరగనున్నాయి. జనవరి నుంచే కొత్త రేట్లు అమలులోకి వస్తాయి. కొత్త ఏడాది ప్రారంభం నుంచి తమ కార్ల ధరలు పెంచుతున్నట్లు దాదాపు అన్ని కంపెనీలు ప్రకటించాయి. అందులో టాటా గ్రూప్ సంస్థ టాటా మోటార్స్ సైతం ఉంది. జనవరి నుంచి కార్ల ధరలను పెంచుతామని ప్రకటించింది. తాజాగా మరో కీలక ప్రకటన చేసింది. కార్ల ధరల పెంపుతో పాటు తమ సంస్థ నుంచి వస్తోన్న కమర్షియల్ వాహనాల ధరలను సైతం పెంచుతామని వెల్లడించింది. అంటే లారీలు, ట్రక్కుల వంటి వాణిజ్య వాహనాలూ మరింత ప్రియం కానున్నాయి. కార్లతో పాటే వాణిజ్య వాహనాల ధరల పెంపు సైతం వచ్చే ఏడాది జనవరి 1, 2024 నుంచి అమలులోకి వస్తాయని టాటా మోటార్స్ పేర్కొంది. మోడల్‌ను బట్టి పెంపు 3 శాతం వరకు ఉంటుందని తెలిపింది. అంటే ఒక్కసారిగా భారీగా ధరలు పెరగనున్నాయని చెప్పుకోవచ్చు. ఈ మేరకు డిసెంబర్ 10, 2023 రోజున వెల్లడించింది టాటా మోటార్స్. అలాగే ధరల పెరుగుదల గత తయారీ ఖర్చుల పెరుగుదలతో ఏర్పడిన నష్టాన్ని భర్తీ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది కంపెనీ. ఈ ధరల పెంపు అనేది వాణిజ్య వాహనాల్లోని అన్ని మోడళ్లకు వర్తిస్తుందని వెల్లడించింది.

టాటా మోటార్స్ వివిధ మోడళ్ల ప్రయాణికుల వాహనాలను విక్రయిస్తోంది. అందులో హ్యాచ్‌బ్యాక్ టియాగో నుంచి ప్రీమియం ఎస్‌యూవీల వరకు ఉన్నాయి. వాటి ధర రూ. 5. 6 లక్షల నుంచి రూ. 25. 94 లక్షల వరకు ఉంది. అయితే, వచ్చే జనవరి నుంచి ఈ ధరలు మరింత పెరగనున్నాయి. ఇప్పటికే మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, హోండా, ఆడీ, హ్యుందాయ్ ఇండియా కంపెనీలు కార్ల ధరల పెంపు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో టాటా మోటార్స్ షేర్లు బీఎస్ఈలో డిసెంబర్ 8వ తేదీన 1 శాతం మేర పడిపోయి రూ.714. 65 వద్ద స్థిరపడ్డాయి.

# రిటైర్మెంట్ తర్వాత నెల నెలా ఆదాయం కావాలా?

సంపాదించే వయసులోనే పదవీ విరమణ గురించి ఆలోచించాలని ఆర్థిక నిపుణులు చెబుతుంటారు. ఇప్పటి నుంచి మంచి ప్రణాళికతో పెట్టుబడి పెడితే రిటైర్మెంట్ తర్వాత నెల నెలా గ్యారెంటీ రిటర్న్ పొందవచ్చు. అందుకు ఏం చేయాలి? ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి అనేది తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. మన దేశ జనాభాలో ఎక్కువ శాతం యువత ఉన్నారు. కానీ ఒక ఇరవై, ముప్పై ఏళ్ల తర్వాత ఇప్పుడు యువతరంలో ఉన్న వారంతా రిటైర్‌మెంట్ వయసుకు చేరుకుంటారు. అప్పటి ఆర్థిక అవసరాలకు అనుగుణంగా వారంతా ఒక బలమైన రిటైర్‌మెంట్ ప్లాన్ తయారు చేసుకోవడం చాలా అవసరం. నెల నెలా గ్యారెంటీ రిటర్న్స్ వచ్చేలా ప్లాన్ చేసుకుంటే ఆర్థిక భద్రతా ఉంటుంది. అయితే.. ఇప్పటి నుంచే పదవీ విరమణ గురించి ఆలోచించడం ఎందుకు అనే భావనలో చాలా మంది ఉంటారు. ఈ అవగాహన లేమి వెనుక రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. మన ముందు తరం వాళ్లు చాలా మంది పెన్షన్ వచ్చే ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్ కావడం, అలాగే ప్రస్తుతం మన జనాభాలో ఎక్కువమంది యువత ఉండటంగా చెప్పుకోవచ్చు. ప్రధానంగా రిటైర్‌మెంట్ ప్లాన్ విషయంలో రెండు అంశాలు బేరీజు వేసుకోవాలి. మనకు అవసరమైన రిటైర్‌మెంట్ ఫండ్ మొత్తం ఎంత ఉండాలి? ఆ మొత్తం సమకూరడానికి ఎలాంటి మదుపు చేయాలి? అనేది చాలా ముఖ్యం. రిటైర్‌మెంట్ ఫండ్ అనే విషయంలో 4 శాతం మాత్రమే ఖర్చులకు



తీసుకోవడం అనే సూత్రం చాలా ప్రాచుర్యం పొందింది. చాలా సరళమైన ఈ విధానం 90లలో విలియం బెంజెన్ అనే ఫైనాన్షియల్ ప్లానర్ ప్రతిపాదించారు. ఈ సూత్రం ప్రకారం రిటైర్‌మెంట్ తర్వాత ప్రతీ ఏడాది పోగు చేసుకున్న ఫండ్ నుంచీ 4 శాతం తమ ఖర్చులకు తీసుకోవాలి. బెంజెన్ ప్రకారం ఇలా చేయడం వల్ల రిటర్మెంట్ తర్వాత కనీసం 33 సంవత్సరాల పాటూ ఉండే అవసరాలకు మనం పోగు చేసుకున్న ఫండ్ సరిపోతుంది. ఈ సూత్రం ప్రకారం ప్రస్తుతం నెల అవసరాలకు రూ.25 వేలు ఖర్చు పెట్టుకుంటున్న కుటుంబం ఇరవై ఏళ్ల తర్వాత ఇదే రకమైన జీవన శైలిని కొనసాగించాలంటే రూ.2.40 కోట్లు కావాల్సి వస్తుంది. రిటైర్‌మెంట్ ఫండ్ మొత్తం ఎంత ఉండాలి అనే విషయం మీద స్పష్టత వచ్చాక, ఆ మొత్తం సమకూర్చుకోవడానికి ఎలాంటి మార్గాల్లో ఎంత మదుపు చేయాలో అర్థం చేసుకోవాలి. నెల జీతం మీద ఆధారపడ్డ ఉద్యోగులు ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్, నేషనల్ పెన్షన్ స్కీం, మ్యూచువల్ ఫండ్స్ వంటివి పరిశీలించవచ్చు. రిటైర్మెంట్ ఫండ్ ఏర్పరచుకోవడానికి కాస్త రిస్క్ తీసుకునే ఉద్యోగులకు మ్యూచువల్ ఫండ్స్ సరైన మార్గంగా చెప్పుకోవచ్చు. ఈపీఎఫ్, ఎన్‌పీఎస్ లాంటి స్కీములతో పోలిస్తే కొతం రిస్క్ ఉంటుంది. అయితే, దీర్ఘకాలం పాటు మదుపు చేస్తారు కాబట్టి రిస్క్ అంతగా ఏర్పడదు. 15 ఏళ్లు ఆ పైన మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్ చేస్తే ఎలాంటి రిస్క్ ఇబ్బంది పెట్టదని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణతో దీనిని అర్థం చేసుకుందాం. నెలకు రూ.20 వేల చొప్పున ఇన్వెస్ట్ చేస్తున్నారు అనుకుందా వారు 20 ఏళ్ల పాటు మదుపు చేస్తే సగటున 18 శాతం రాబడి వస్తుందని అనుకుంటే వారి కార్పస్ రూ.2 కోట్ల 30 లక్షల పైన అవుతుంది. అయితే, ఈ స్థాయిలో రాబడి కష్టమే. కానీ, 12 నుంచి 15 శాతం ఇస్తున్న ఫండ్స్ చాలా ఉన్నాయి. వాటిల్లో ఇన్వెస్ట్ చేయడం మంచిది.

# ఇన్వెస్టర్లకు గుడ్‌న్యూస్..





మీరు మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారా? అయితే, మీకో గుడ్‌న్యూస్. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవలే కీలక నిర్ణయం తీసుకుంది. మ్యూచువల్ ఫండ్స్ రికరింగ్ పేమెంట్స్ కోసం ఆటో డెబిట్ లిమిట్‌ను రూ.1 లక్షకు పెంచింది. దీంతో ఎలాంటి ఓటీపీ అథెంటికేషన్ లేకుండానే బ్యాంక్ అకౌంట్ నుంచి పేమెంట్స్ చేయొచ్చు. ఆ వివరాలు తెలుసుకుందాం.

మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్లు ఇకపై ఇ-మ్యాండెట్స్ ద్వారా అధిక మొత్తంలో ఇన్వెస్ట్ చేయొచ్చు. అడిషనల్ ఫ్యాక్టర్ ఆఫ్ అథెంటికేషన్ అవసరం లేకుండానే ఇప్పుడు మ్యూచువల్ ఫండ్స్‌లో ఎక్కువ మొత్తం ఇన్వెస్ట్ చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అవకాశం కల్పిస్తోంది. ఇది ఫండ్స్ ఇన్వెస్టర్లకు మంచి అవకాశంగా చెప్పుకోవచ్చు. ఈ మేరకు ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశంలో తీసుకున్న వివిధ నిర్ణయాలను గత శుక్రవారం ప్రకటించారు గవర్నర్ శక్తికాంత దాస్. ఈ సందర్భంగా మ్యూచువల్ ఫండ్స్ సబ్‌స్క్రిప్షన్, ఇన్సూరెన్స్ ప్రీమియం పేమెంట్, క్రెడిట్ కార్డు బిల్స్ పేమెంట్స్ వంటి కేటగిరీలకు చేసే ఆటో డెబిట్ రికరింగ్ పేమెంట్లలో ఏఎఫ్ఏ అవసరం లేకుండానే చేసే పేమెంట్ల పరిమితిని రూ.1 లక్షకు పెంచుతున్నట్లు తెలిపారు. గత శుక్రవారం మానిటరీ పాలసీ కమిటీలోని నిర్ణయాలను వెల్లడించారు గవర్నర్ శక్తికాంత దాస్. కీలక పాలసీ రేటు రెపో రేటును యథాతథంగా 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇది వరుసగా ఐదోసారి వడ్డీ రేట్లను మార్చకుండా కొనసాగించడం. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు పెంచలేదు. ఈ సందర్భంగానే రికరింగ్ ట్రాన్సాక్షన్ల ఇ-మ్యాండెట్ అంశంపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కస్టమర్ల సౌలభ్యం కోసం డిజిటల్ ట్రాన్సాక్షన్ల సెక్యూరిటీ, భద్రతను ఆలోచించి రికరింగ్ ట్రాన్సాక్షన్లకు ఇ-మ్యాండెట్ ప్రాసెస్‌ను ఆగస్టు 2019లో తీసుకొచ్చింది ఆర్‌బీఐ. ప్రస్తుతం అడిషనల్ ఫ్యాక్టర్ అథెంటికేషన్ ఏఎఫ్ఏ లేకుండా రూ.15 వేల వరకు చేయొచ్చు. దానిని దాటితే ఓటీపీ అథెంటికేషన్ అవసరమయ్యేది. అందుకు ముందు జూన్ 2022లో దీనిని అప్డేట్ చేసింది ఆర్‌బీఐ. ప్రస్తుతం నెలకు ఇ-మ్యాండేట్స్ అనేవి 8.5 కోట్లుగా నమోదవుతున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. వాటి విలువ సుమారు రూ.2,800 కోట్లుగా ఉన్నట్లు తెలిపింది. ప్రస్తుతం వ్యవస్థ అనేది స్థిరంగా ఉందని, మ్యూచువల్ ఫండ్స్ సబ్‌స్క్రిప్షన్స్, ఇన్సూరెన్స్ ప్రీమియం, క్రెడిట్ కార్డు బిల్ పేమెంట్స్ లకు సంబంధించిన ట్రాన్సాక్షన్ల సైతం అనేది రూ. 15 వేలకుపైగా జరుగుతున్నట్లు ఆర్‌బీఐ గుర్తించింది. దీంతో ఈ లిమిట్‌ను పెంచాల్సిన అవసరం ఉందని గుర్తించి రూ.1 లక్షకు పెంచినట్లు గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు.

# దుద్యాలలో మిన్నంటిన బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి సంబరాలు!

**ఆత్మకూరు ఉతట్తేజిత**



రాజ్యాంగ నిర్మాతకు నీరాజనం పట్టిన దుద్యాల - టీడీపీ మండల నాయకుడు మహమ్మద్ రఫీమరియు స్ర. మల్లారెడ్డి టీడీపీ నాయకులు ఎతీజూం నాయకులు ఈరగాళ్ల. రాజు. మరియు మాలమహానాడూ నాయకులు ప్రాతకోట రమేష్ ఆధ్వర్యంలో ఘన నవాళికొత్తపల్లి :నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రాజ్యాంగ నిర్మాత ఆశయాలను స్మరిస్తూ, గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులుప్రాతకోట రమేష్ ఎతీజూం నాయకులు ఈరగాళ్ల రాజు మరియు టీడీపీ మండల నాయకులు మహమ్మద్ రఫీ, టీడీపీ నాయకులు స్ర. మల్లారెడ్డి ఎమ్మె, ర్, ఎమ్మె మైనారిటీస్ నాయకులు గ్రామప్రజలు ఆధ్వర్యములో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా "జై భీమ్.. జై నీమ్ నినాదాలతో దుద్యాల మారుమోగింది.రాజ్యాంగ స్ఫూర్తితోనే సామాజిక మార్పు:అంబేడ్కర్ చిత్రపటానికి నివాళు లర్పించిన అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ప్రాతకోట రమేష్ మాట్లాడుతూ కొత్తపల్లె మండలంలో ని పెద్దగ్రామలైన కొక్కెరంచ దుద్యాల గ్రామాలలో అంబేడ్కర్ గారి విగ్రహాలు లేకపోవడం బాధాకరమని వచ్చే సంవత్సరం ఏప్రిల్ 14 కళ్ల నాయకుల మరియు దాతల సాకారంతో విగ్రహాలు ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చారు. అందుకు నాయకులుమరియు ఇవేడుకలలో పాల్గొన్న గురువగాళ్ల ఓబులేసు ఆర్మీజవాను, రఫీ గారు, మల్లారెడ్డి గారుచెప్పు. రమేష్ అందుకు సహకారం అందిస్తామని చెప్పారు. . "ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని భారతీయులకు అందించిన మహనీయుడు బాబాసాహెబ్. ఆయన కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం వల్లే నేడు సామాన్యుడికి సైతం సమాన హక్కులు లభిస్తున్నాయి. అంబేడ్కర్ గారు చూపిన బాటలో నడవడమే మనం ఆయనకు ఇచ్చే అసలైన నివాళి" అని ప్రాతకోట రమేష్, రఫీ పేర్కొన్నారు. రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే మన హక్కులను మనం కాపాడుకోగలమని ఆయన గ్రామస్తులకు వివరించారు.యువతకు పిలుపు.. దళిత సంఘాల ఉత్సాహం:చదువుకో, సమీకరించుకో, పోరాడు" అనే అంబేడ్కర్ పిలుపును యువత స్ఫూర్తిగా తీసుకోవాలని రఫీ యువత ఉన్నత విద్యను అభ్యసించి, రాజ్యాంగ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ?విజయవంతమైన కార్యక్రమం:ఈ వేడుకల్లో వివిధ దళిత సంఘాలనాయకులు ఎమ్మె ర్ ఎమ్మె మైనారిటీ నాయకులు ప్రజా ప్రతినిధులు,దుద్యాల గ్రామ పెద్దలు, యువజన సంఘాల సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# ఇంటర్మీడియేట్ పరీక్ష ఫలితాల్లో సత్తాచాటిన ఆత్మకూరు కస్తూరిబా గాంధి విద్యాలయ బాలికల కళాశాల

**ఆత్మకూరు ఉత్తేజిత**



నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం కస్తూరిబా గాంధీ విద్యాలయ బాలికల కళాశాల యందు బైపిసి గ్రూప్ 2025 - 26 సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ 81% ఫలితాలను, సెకండ్ ఇయర్ లో 97% ఫలితాలతో ఘనవిజయం సాధించారని కేజీబీవీ ప్రిన్సిపల్ వి.శ్యామల తెలియజేశారు. సెకండ్ ఇయర్ 97% ఫలితాలతో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందని అన్నారు. సెకండ్ ఇయర్ 30 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 29 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, సెకండ్ ఇయర్ ఫలితాలలో 973/1000 మార్కులతో ఎం. మౌనిక మొదటి స్థానంలో, 942/1000 మార్కులతో ఎస్.స్వీటీ గ్లోరీ సుజిత ద్వితీయ స్థానంలో, 929/1000 మార్కులతో ఎస్.కళ్యాణి తృతీయ స్థానంలో నిలిచారు. ఫస్ట్ ఇయర్లో 37 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 30 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ఫస్ట్ ఇయర్ నందు జి.దుర్గ 445 మార్కులకు 442 మార్కులతో మొదటి స్థానంలో నిలిచిందని, ద్వితీయ స్థానంలో ఈ.హర్షిత 416/445 మార్పులతో ప్రభంజనం సృష్టించారని, ఇంత మంచి మార్కులు రావడంతో ఉపాధ్యాయులను, సిబ్బందిని, మంచి ఫలితాలను సాధించిన విద్యార్థుల పట్ల కేజీబీవీ ప్రిన్సిపల్ వి.శ్యామల ఆనందం వ్యక్తపరుస్తూ అభినందించారు.

# "ప్రతి బాలుడు పాఠశాలకు" -- కొణిదెలలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ జోరుగా..



**నందికొట్కూరు.. ఉత్తేజిత ప్రతినిధి ఏప్రిల్ 15**



నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ఎంపీపీ ఎస్ మోడల్ ప్రైమరీ స్కూల్లో బుధవారం ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. విద్యా చైతన్యాన్ని పెంపొందించేందుకు అధికారులు పోస్టర్లు, పాంప్లెట్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారి (ఎంఈఓ) రామిరెడ్డి, కాంప్లెక్స్ చైర్మన్ రామచంద్ర మూర్తి, హెచ్ఎం సుశీల, ఉపాధ్యాయులు స్వాములమ్మ, మనోహర్, శివ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.అధికారులు మాట్లాడుతూ ప్రతి చిన్నారికి ప్రాథమిక విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, 1 నుంచి 5వ తరగతుల వరకు పిల్లలను తప్పకుండా పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థుల హాజరు పెంపు, డ్రాప్ అవుట్ల నియంత్రణలో అందరూ కలిసి పనిచేయాలని కోరారు.గ్రామంలో ర్యాలీ నిర్వహించి "ప్రతి బాలుడు -- పాఠశాలకు" అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. విద్యా హక్కు ప్రతి ఒక్కరికీ అందాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు

# అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి...!

## - 14 అంగన్వాడీ ఆయా పోస్టులకు ఆహ్వానం

## - నందికొట్కూరు సిడిపిఓ బి.ఎ.. మంగావళి

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి ఏప్రిల్ 15 -:**



ఐసిడిఎస్ ప్రాజెక్టు నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలో ఖాళీగా ఉన్న 14 అంగన్వాడీ ఆయా పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థినీలు దరఖాస్తులు చేసుకోవాలని నందికొట్కూరు ఐసిడిఎస్ సిడిపిఓ మంగావళి తెలిపారు. బుధవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ ఆయా పోస్టుల ఖాళీలు వివరాలు ఇలా ఉన్నాయి. నందికొట్కూరు మండలానికి సంబంధించి నందికొట్కూరు -6 అంగన్వాడీ కేంద్రం( బీసీ-సీ) నందికొట్కూరు- 20వ అంగన్వాడీ కేంద్రం( ఓసి) మిడుతూరు మండల పరిధిలో పైపాలెం అంగన్వాడీ కేంద్రం (ఓసి) చౌట్కూరు -3 అంగన్వాడీ కేంద్రం ( ఎస్సీ -3 ) పగిడ్యాల మండల పరిధిలో లక్ష్మాపురం-1 అంగన్వాడీ కేంద్రం ( ఓసి) , ఆంజనేయ నగర్ అంగన్వాడీ కేంద్రం( ఓసి- ఈడబ్ల్యూఎస్) కొత్తపల్లి మండలం పరిధిలో పి. సిద్దేశ్వరం అంగన్వాడీ కేంద్రం( ఓసి) ,ముసలిమడుగు-1 అంగన్వాడీ కేంద్రం ( ఓసి), జి. వీరాపురం-2 అంగన్వాడీ కేంద్రం ఓసి( వీహెచ్), సింగరాజు పల్లె గూడెం అంగన్వాడీ కేంద్రం( ఎస్.టి), పెద్ద గుమ్మడాపురం గూడెం అంగన్వాడీ కేంద్రం( బిసి-డి), జానాల గూడెం అంగన్వాడీ కేంద్రం(బిసి-డి), ముసలిమడుగు గూడెం అంగన్వాడీ కేంద్రం(బిసి-డి) పాములపాడు మండల పరిధిలో గల మిట్ట కందాల-3 అంగన్వాడీ కేంద్రం ( బిసి-సి) ఈ పోస్ట్ సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రధాన న్యాయస్థానంలో డబ్ల్యూ .పి .నెంబర్ 34892/2025 ద్వారా పెండింగ్లో ఉన్నది. కావున ఆ యొక్క అంగన్వాడీ ఆయా పోస్ట్ ను కోర్టు వెలువరించే తుది తీర్పుకు లోబడి నియామకం చేపట్టబడును. కావున అభ్యర్థులు ఈ మార్పు గమనించగలరు. అంతేగాక అభ్యర్థి తప్పనిసరిగా పదవతరగతి ఉత్తీర్ణులే ఉండాలన్నారు. అభ్యర్థి 1.7.2025 నాటికి 21 సంవత్సరాలు వయసు నిండి 35 సంవత్సరాల వయసులోపు వారైనా ఉండవలెనన్నారు. అభ్యర్థినులు తప్పనిసరిగా వివాహతురాలై ఉండవలెనని మరియు స్థానిక నివాసితురాలై ఉండవలెనన్నారు. ఎస్సీ ,ఎస్టీ జనవాస ప్రాంతాలలోని అభ్యర్థి నీలలో 21 సంవత్సరాల వయస్సు నిండిన వారు లేనిచో దిగువ వయస్సు 18 సంవత్సరాలు నిండిన వారిని పరిగణ లోనికి తీసుకోబడునున్నారు. పుట్టిన తేదీ లేదా వయస్సు ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత ధ్రువీకరణ పత్రం యస్ యస్ సి మార్క్ లిస్ట్ టీసి మరియు ఎక్కువ తరగతి చదివిన వారు మార్క్ లిస్ట్ మరియు టీసీ జతపరచలను. నివాసస్థల ధ్రువీకరణ పత్రం, వితంతువు అయినచో భర్త మరణ ధ్రువీకరణ పత్రం, వికలాంగులైనచో సదరం క్యాంప్ వారు జారీ చేసిన సర్టిఫికెట్, ఆధార్ కార్డు మరియు రేషన్ కార్డు దరఖాస్తు వెంట అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జిరాక్స్ కాపీలను( సెల్ఫ్ అట్టి స్టేషన్) చేసి సంబంధిత సిడిపిఓ కార్యాలయంలో ఈనెల 23వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపల దరఖాస్తులు సమర్పించాలని ఆమె తెలిపారు.

# తిరుపతి, చంద్రగిరిలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేష్

## తిరుపతిలో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను ప్రారంభించిన మంత్రి నారా లోకేష్

**తిరుపతి ఉత్తేజిత ఏప్రిల్ 15.**



తిరుపతిని స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దుతామనే యువగళం హామీ కార్యరూపం దాలుస్తోంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఏడాదిలో రూ.35 కోట్లకు పైగా నిధులు కేటాయించడం జరిగింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తిరుపతి పట్టణం గొల్లవానిగుంటలో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ క్రికెట్ పెవిలియన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అకాడమీలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. శాప్, తుడా సహకారంతో రూ.10.10 కోట్ల నిధులు వెచ్చించి ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను నిర్మించారు. ముందుగా క్రీడా ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ తో పాటు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ అకాడమీలను మంత్రి లోకేష్ ప్రారంభించారు. క్రీడా ప్రాంగణం మొత్తం కలియతిరిగారు. ఈ సందర్భంగా క్రికెట్, కబడ్డీ, కోకో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ క్రీడాకారులతో గ్రూప్ ఫోటో దిగారు. కొద్దిసేపు వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఎన్టీఆర్ క్రికెట్ స్టేడియంతో పాటు ఎన్టీఆర్ క్రికెట్ పెవిలియన్ ను ప్రారంభించారు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాల్ రాజ్, ఇతర క్రీడాకారులతో కలిసి కొద్దిసేపు క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులతో సంభాషించి వారిని ఉత్సాహపరిచారు. క్రీడా ప్రాంగణంలో ప్రణీత్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ ను మంత్రి ప్రారంభించారు. ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను క్రికెట్ మైదానం, ఖోఖో, కబడ్డీ, ఖఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ కోర్టులతో పాటు పలు క్రీడా సౌకర్యాలతో అభివృద్ధి చేశారు. ఈ సముదాయం క్రీడా సంస్కృతిని ప్రోత్సహించడంతో పాటు ఈ ప్రాంత భవిష్యత్ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించనుంది.అంతకుముందు తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో రూ.5.35 కోట్ల వ్యయంతో కరణం మల్లీశ్వరి వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ, 200 మంది క్రీడాకారులకు వసతి సదుపాయం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన జూనియర్ బాక్సింగ్ రింక్ ను ప్రారంభించారు. గూడూరు నియోజకవర్గం కోటలో రూ.2.31 కోట్ల వ్యయంతో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం, సూళ్లూరుపేటలో రూ.2.70 కోట్ల వ్యయంతో క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. రేణిగుంట ఏపీఎస్టీఆర్ఈఐఎస్ స్కూల్ లో రూ.80 లక్షల వ్యయంతో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రవాణ, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సి.షణ్ముగ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ శ్రీపతి బాబు, భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, సూర్య చరిష్మ తమిరి, దండు పూజ, నవ్య కందేరి, భారత అంధ క్రికెటర్ ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డి, అంధ మహిళా క్రికెటర్ పంగి కరుణ కుమారి, పారా అథ్లెట్ రవి రంగలి, పారా సైక్లిస్ట్ షేక్ అర్షద్, పారా అథ్లెట్ కె.లలిత, ఆర్చరీ ప్లేయర్ టి.గణేష్ మణిరత్నం, భారత హాకీ క్రీడాకారిణి రజని ఇటిమరపు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి - ఎంపీపీ

**బేతంచెర్ల ::ఉత్తేజిత ప్రతినిధి**




: వేసవిలో మండలంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణ్ రెడ్డి,అధికారులను ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలోజెడ్పిటిసి శివలక్ష్మి,ఎంపీడీవో ఫజల్ రహిమాన్ ఆధ్వర్యంలో మండల సర్వ సభ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామాలలో ఉన్న పలు సమస్యలను ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు.ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణమే పరిష్కార మార్గాలు చూపాలని ఆయన సూచించారు.అనంతరం అధికారులు మూడు నెలలలో చేసిన అభివృద్ధి పనుల నివేదికలను చదివి వినిపించారు ఎంఈఓ 2 అబ్రహం,మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని ప్రభుత్వ పాఠశాలలో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉంటారని పాఠశాలలో రుచికరమైన మధ్యాహ్న భోజనం బట్టలు,షూస్,బెల్టులు,అన్ని సౌకర్యాలు ఉంటాయని కాబట్టి ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని వారన్నారు.ఈ కార్యక్రమంలో పిఆర్ ఏఈ మహేష్,ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ రెడ్డి,ఎంపీటీసీలు రామచంద్రారెడ్డి,మునీశ్వర్ రెడ్డి,మండల ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో వేసవిలో త్రాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి... గిత్త.

**: ఉజ్వల ఆంధ్రప్రదేశ్ కోసం ఆరోగ్యకరమైన ఆహారం ఎంపిక పోస్టు విడుదల.**

**ఉత్తేజిత ప్రతినిధి..నందికొట్కూర్**




ఏప్రిల్ 15 నందికొట్కూరు మండల పరిధిలోని గ్రామాలలో వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గిత్త జయసూర్య మండల స్థాయి అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బాలాంకరి మురళీకృష్ణ రెడ్డి అధ్యక్షతన నందికొట్కూరు మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నియోజకవర్గ శాసనసభ్యులు గిత్త జయ సూర్య మాట్లాడుతూ గ్రామాలలో నూతనంగా స్పెషల్ అధికారుల పాలన కొనసాగుతుందని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. అలాగే గ్రామంలో వైద్య సేవలు,మౌలిక వసతులపై దృష్టి సారించాలని ఆయన అధికారులను హెచ్చరించారు. అనంతరం పిల్లల అభివృద్ధి కాపాడుకుందాం స్క్రీన్ లా నుంచి అనుబంధ ల ద్వారా ఆటలవైపు ఉజ్వల ఆంధ్రప్రదేశ్ కోసం ఆరోగ్యకరమైన ఆహారం ఎంపిక పోస్టులను ఎమ్మెల్యేతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు ఆవిష్కరించడం జరిగింది. ఈ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్య శర్మ, నందికొట్కూరు బ్రాహ్మణ కొట్కూరు సింగిల్ విండో చైర్మన్లు మూర్తు జావలి, మద్దూరు హరి సర్వోత్తమ రెడ్డి, పంచాయతీరాజ్ జేఈ వెంకటేశ్వర్లు,ఏవో షేక్షావలి,హౌసింగ్ ఏఈ అరుణ్ కుమార్, రెవెన్యూ, ఎక్సైజ్, ఐసిడిఎస్,పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. పగిడ్యాల మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి,కలమందలపాడు రాజశేఖర్ రెడ్డి, వడ్డేమాన్ మాజీ సర్పంచ్ సత్యం రెడ్డి, షేక్ జమీల్, తదితరులు పాల్గొన్నారు.

# రేణిగుంట తాసిల్దార్ శ్యామ్ ప్రసాద్కు జర్నలిస్టులు సన్మానం...



**రేణిగుంట ఉత్తేజిత ఏప్రిల్ 15.**

రేణిగుంట మండల ఇంచార్జ్ తాసిల్దార్గా బాధ్యతలు స్వీకరించిన శ్యామ్ ప్రసాద్ ని మండల జర్నలిస్టు సభ్యులు మర్యాదపూర్వకలగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాల వేసి, శాలువాతో కప్పి సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ జర్నలిస్టులు మోహన్ నాయుడు, చందు మాట్లాడుతూ.. శ్యామ్ ప్రసాద్ అందరికీ సుపరిచితులని, గతంలో కూడా ఆయన డిప్యూటీ తాసిల్దార్ గా సమర్థవంతమైన సేవలు అందించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మళ్ళీ ఇదే మండలానికి ఆయన తాసిల్దార్గా రావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.శ్యామ్ ప్రసాద్ ఎప్పుడూ సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా, సమస్యలను పరిష్కరించడంలో ఆయన ప్రత్యేక చొరవ చూపుతారని, మండల అభివృద్ధిలో ఆయన అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిబద్ధత గల అధికారిగా ఆయనకు మంచి పేరు ఉందని కొనియాడారు.

# రాహుల్..అపరిపక్వ విపక్షనేత !



భారత ప్రజాస్వామ్యంలో విపక్ష నేత అంటే బురదజల్లే నేత అని అర్థం రూఢి అవుతోంది. అధికారంలో ఏ పార్టీ ఉన్నా విపక్షంలో ఉన్నవారు నాలుగు రాళ్లు వేయడం, ఇంత బురద జల్లడం, ప్రభుత్వం ఏం చెబుతుందో తెలుసుకోకుండానే సభనుంచి నిష్క్రమించడం పరిపాటిగా మారింది. సరిగ్గా లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ ఇప్పుడు అదే పాత్రలో ఒదిగి పోయారు. పశ్చిమాసియా యుద్ధంతో ప్రపంచమంతా వణుకుతోంది. అమెరికా, ఇజ్రాయిల్ ఆయుధ బలంతో ఇరాన్‌ను ధ్వంసం చేయడం ద్వారా ప్రపంచంలోని మారుమూల పల్లె కూడా ప్రభావితం అవుతోంది. మనవద్ద గ్యాస్, ఇంధన కొరతలను ఎదుర్కొంటున్నాం. ఇదేమీ మోడీ తెచ్చుకున్న విపత్తు కాదు. లేదా కావాలని కోరుకున్నదీ కాదు. అధికారంలో కాంగ్రెస్ ఉండివుంటే ఇంతకన్నా దారుణంగా ఉండేది. ఎందుకంటే బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాతనే క్రూడాయిల్ దిగుమతి పెరిగింది. ఇంధన సామర్థ్యం పెరిగింది. దేశంలో రిఫనరీల సామర్థ్యం పెంచి వ్యాపారం చేసుకునే స్థాయికి ఎదగింది. గ్యాస్ అందరికీ అందుబాటులోకి వచ్చింది. మారుమూల పల్లెలకు సైతం గ్యాస్ చేరుతోంది. ఇతర దేశాలకు కూడా ఇంధనం సరఫరా చేసే స్థాయికి భారత్ ఎదిగింది. వివిధ దేశాలతో సత్సంబంధాలే ఇందుకు నిదర్శనం. ఇంత సంక్షోభంలోనూ ఇరాన్ మనపట్ల సానుకూలంగా ఉందంటే, మనం అనుసరిస్తున్న విదేశాంగ విధానమే కారణం. రాహుల్ చెప్పటినట్లు నడుచుకుంటే దేశం ఏనాడో భ్రష్టు పట్టిపోయేది. ఇకపోతే ఈ సంక్షోభంలోనూ మనం బంగ్లాదేశ్‌కు ఇంధనం సరఫరా చేయగలి గాం. అయితే ఇవేవీ గమనించకుండా పార్లమెంటులో రాహుల్ చేసిన ప్రసంగం చిన్నపిల్లవాడికన్నా అధ్వాన్నంగా ఉంది. విపక్షనేతకు సమస్యలు, పరిస్థితులు తెలిసి ఉండాలి. కానీ దేశంలో ప్రస్తుతం నెలకొన్న వంట గ్యాస్ కొరతకు, ఎప్‌స్టిన్ ఫైల్స్‌లో పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి పేరు ఉండడానికి సంబంధం ఉందంటూ విపక్షనేత రాహుల్ గాంధీ లోక్‌సభలో గురువారం చేసిన ఆరోపణలు ఆయన అజ్ఞానానికి నిదర్శనంగా చూడాలి. రాజకీయ పరిపక్వత లేని నేత విపక్ష నేతగా ఉన్నందుకు సిగ్గుపడాలి. పశ్చిమాసియా లో జరుగుతున్న యుద్ధం కారణంగా వంట గ్యాస్ కొరత ఏర్పడింది. అయినా కేంద్రం దానిని మానిటర్ చేస్తోంది. ఇంధన భద్రతపై ప్రభుత్వం రాజీ పడినందువల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని రాహుల్ చేసిన విమర్శలు దేశం పట్ల ఆయనకున్న అవగాహన ఇదేనని అర్థం చేసుకోవాలి. దేశ ఇంధన అవసరాలపై అమెరికా ఆంక్షలు విధించే స్థితికి తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. మనం ఆయిల్‌ను ఎవరి నుంచి కొనుగోలు చేయాలి, గ్యాస్‌ను ఎక్కడి నుంచి తీసుకురావాలి అన్న నిర్ణయాలను అమెరికాకు విడిచిపెట్టాం అనడంలో అర్థం లేదు. విదేశాల నుంచి వాణిజ్యానికి కూడా కొన్ని పరిమితులు ఉంటాయి. రష్యా నుంచి ఆయిల్ కొనాలా, వద్దా అన్నది కూడా వాణిజ్య ఒపపందాలకు ముడిపడి ఉన్న అంశం. ఈ మాత్రం తెలియని వ్యక్తి విపక్ష నేతగా ఎలా ఉంటున్నారో ప్రజలు తెలుసుకోవాలి. ఇకపోతే మాట్లాడేదంతా మాట్లాడిన అన్నా చెల్లెళ్లు రాహుల్, ప్రియాంకలు ప్రభుత్వం సమాధానం ఇచ్చే వరకు వేచి చూడకుండా సభ నుంచి నిష్క్రమించారు. ఇది చాలు..వారు ఎంత చిత్తశుద్ధిగా ఉన్నారో తెలియడానికి. బయటకు వెళ్లి ధర్నాలు చేయడం తప్ప రాహుల్‌కు తెలిసిందేమీ లేదు. ఇదంతా ఒక ఎత్తయితే ఇరాన్ మన దేశం పట్ల చాలా సానుకూలంగా ఉండడంతో తొలి చమురు నౌక భారత్ చేరుకోగలిగింది. అలాగే రష్యా నుంచి మనం ఇంధన దిగుమతులకు అమెరికా తలూపింది. ఇవన్నీ కూడా విదేశాంగ నీతిలో ఓ భాగం. ఇకపోతే ఈ యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియదు. అందువల్ల దేశంలో ఉన్న ఇంధన వనరులను జాగ్రత్తగా వాడుకోవాల్సిందే. తమ దేశంపై అమెరికా, ఇజ్రాయిల్ అక్రమంగా సాగిస్తున్న యుద్ధానికి సహకరిస్తున్న

స్థావరాలను మూసివేయల్సిందిగా పొరుగున గల గల్ఫ్ అరబ్ దేశాలను ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా ముజ్తబా ఖమేనీ కోరారు. లేనిపక్షంలో వాటిపై దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఇరాన్ సుప్రీంనేతగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమంపై తీవ్రంగానే స్పందించారు. పూర్తిగా సాధించేవరకు ప్రతీకారానికి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. కీలకమైన హార్మూజ్ జలసంధిని గురువారం కూడా మూసివేయాలని ఆదేశించారు. ఇంత జరుగుతున్న ట్రంప్ ఇంకా తన వంకర బుద్దిని మార్చుకోవడం లేదు. ముడి చమురు ధరల కన్నా కూడా ఇస్లామిక్ రిపబ్లిక్ 'దుష్ట సామ్రాజ్యాన్ని' నిలువరించడమే తమకు మరింత ముఖ్యమని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆయన దుర్మార్గాన్ని బయటపెడుతున్నాయి. చమురు ద్వారా లాభాలు ఆర్జించడం కన్నా ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకోకుండా అడ్డుకోవాలన్నదే ప్రాధాన్యత అని చెప్పారు. ఇరాన్ అణుశక్తిని సమకూర్చుకోవడాన్ని అనుమతించేది లేదంటూ వ్యాఖ్యానించారు. 'పని పూర్తి చేయాలని' అమెరికా కృతనిశ్చయంతో ఉన్నదని ట్రంప్ తెలిపారు. యుద్ధంలో సమర్థవంతంగా విజయాన్ని సాధించామని, అయినప్పటికీ సైనిక చర్యలు కొనసాగుతాయని ఆయన అన్నారు. అయితే తాను ఎప్పుడు అనుకుంటే అప్పుడే యుద్ధం ముగుస్తుం దంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను ఇరాన్ తిప్పికొట్టింది. యుద్ధం ముగింపుపై నిర్ణయం తీసుకోవాల్సింది తామేనని స్పష్టం చేసింది. యుద్ధాన్ని ముగించేందుకు మూడు షరతులు విధించింది. ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, చట్టబద్ధమైన హక్కులను గుర్తించాలని, నష్టపరిహారం చెల్లించా లని, భవిష్యత్తులో ఎలాంటి దురాక్రమణలు జరగకుండా అంతర్జాతీయ సమాజం హామీ ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఆ మూడు షరతులు నెరవేరుస్తామని హామీ ఇస్తేనే యుద్ధాన్ని ముగిస్తామని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అందువల్ల ఇప్పట్లో అ కుంపటి చల్లారదని తేలిపోయింది. మనవరకు మనం ఇంధన అవసరాలు తీర్చుకోవడం ముఖ్యం. దేశంలో ఇంధన సంక్షోభ పెచ్చరిల్లుతున్న సమయంలో భారత్‌కు పెద్ద ఊరట లభించింది. భారత్ పతాకంతో ఉన్న నౌకలను హర్మూజ్ జలసంధిని దాటేందుకు ఇరాన్ అనుమతించింది. భారత్, ఇరాన్ విదేశాంగ మంత్రులు జైశంకర్, అబ్బాస్ అరాగ్చీ ఫోన్లో మాట్లాడిన అనంతరం మన దేశానికి ఈ ఉపశమనం దక్కింది. పుష్పక్, పరిమళ్ అనే రెండు భారతీయ నౌకలు క్షేమంగా హర్మూజ్ జలసంధిని దాటాయి. ఇంకా ఇలాంటి ప్రయత్నాలు ఉండనున్నాయి. ఇది ఓ రకంగా మనం అనుసరిస్తున్న విదేశాంగ విధాన విజయానికి సూచిక.

# రష్యా నుంచి చమురు కొనుగోళ్లు

### భారత్‌కు అనమతించిన అమెరికా వాణిజ్య శాఖ

### ఇందన సంక్షోభానికి తెరదించే యత్నంగా వెల్లడి



వాషింగ్టన్: ఇరాన్ – ఇజ్రాయెల్, అమెరికాల ఉద్రిక్తతల నేపథ్యంలో తీవ్ర ఇంధన సంక్షోభం ఎదుర్కొంటున్న వేళ ప్రపంచ దేశాలకు కాస్త ఉపశమనం లభించింది. రష్యా చమురు కొనుగోలుకు స్వల్పకాలికంగా అనుమతినిస్తూ అమెరికా ఉత్తర్వులు జారీ చేసింది. సముద్రంలో నిలిచిపోయిన చమురును కొనుగోలు చేసేందుకు ఏప్రిల్ 11 వరకు అవకాశం కల్పించింది. ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లో నెలకొన్న అనిశ్చితిని తొలగించేందుకు అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్న తరుణంలో గ్లోబల్ ఎనర్జీ మార్కెట్‌లో స్థిరత్వాన్ని తీసుకు రావడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్టు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 'ప్రపంచ ఇంధన మార్కెట్‌లో స్థిరత్వాన్ని పెంపొందించడం, ధరలను అదుపులో ఉంచేందుకే ట్రంప్ ఈ నిర్ణయాత్మక చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతానికి సముద్రంలో నిలిచిపోయిన చమురు రవాణాకు మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయి' అని బెసెంట్ స్పష్టం చేశారు. రష్యాపై ఆంక్షలు అమల్లో ఉన్నప్పటి కీ అమెరికా తాత్కాలిక సడలింపులతో పుతిన్ ప్రభుత్వానికి పెద్దగా ఆర్థిక ప్రయోజనం ఉండదని బెసెంట్ అన్నారు. రష్యాకు వచ్చే ఆదాయంలో అధిక భాగం చమురు వెలికితీసే సమయంలోనే పన్నుల రూపంలో అందుతుందని, ఇప్పుడు రవాణాలో ఉన్న చమురు అమ్మకం వల్ల వారికి అదనపు ప్రయోజనమేమీ ఉండదని ఆయన వివరించారు. ఈ నిర్ణయం వల్ల స్వల్పకాలికంగా ధరలు పెరిగినా.. దీర్ఘకాలంలో అమెరికా

ఆర్థిక వ్యవస్థకు ఇది ఎంతో మేలుచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అయితే.. తాజా సడలింపులతో మార్చి 12 నాటికి నౌకల్లో లోడ్ అయిన రష్యా ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులను ఏప్రిల్ 11 వరకు విక్రయించుకోవచ్చు. గతంలో అమెరికా ఆంక్షలు విధించిన రష్యన్ సంస్థల నుంచి ఉత్పత్తైన చమురును కూడా ఇప్పుడు కొనుగోలు చేసుకోవచ్చు. ఇకపోతే ప్రపంచ దేశాల్లో ఇంధన సంక్షోభం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో భారత్‌కు ఇరాన్ ఉపశమనం కలిగించింది. భారతీయ ట్యాంకర్లను హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లేందుకు అనుమతించింది. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రమణ్యం జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య జరిగిన చర్చల అనంతరం.. భారత జెండాలు కలిగిన నౌకలకు టెహ్రాన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ పరిణామంతో అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపా దేశాలకు చెందిన నౌకలు ఆంక్షలు ఎదుర్కుంటున్నప్పటికీ.. పుష్పక్, పరిమళ్ అనే రెండు భారతీయ ట్యాంకర్లు వ్యూహాత్మకంగా హోర్ముజ్ జలసంధిని దాటినట్టు పేర్కొన్నాయి.







# ఇరాన్ వ్యూహాత్మక అడుగులు

### అమెరికాపై పట్టుకు వేగంగా కదులుతున్న పావులు

### గల్ఫ్ దేశాలకు ప్రాణసంకటంగా ఇరాన్ దాడులు

న్యూఢిల్లీ: అమెరికా, ఇజ్రాయిల్ కలసి చేస్తున్న యుద్ధంతో ఇప్పుడు ప్రపంచం యావత్తూ అతలాకుతలం అవుతోంది. ప్రధానంగా ఇంధన సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. ఈ యుద్ధం నుంచి వెన్నక్కి తగ్గలేక, ముందుకు వెళ్లలేక గింజుకుంటున్నాయి. ఈ యుద్ధంతో ఇజ్రాయిల్ పెద్దగా నష్టపోకున్నా, అమెరికా మాత్రం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతోంది. అలాగే ఇరాన్‌ను దెబ్బతీయాలన్న లక్ష్యం నెరవేరలేదు. అంతేగాకుండా ప్రజల మద్దతుతో ఇరాన్ మరింత బలంగా దాడులను తిప్పికొట్టడానికి సిద్దం అవుతోంది. ఇది ఓ రకంగా అమెరికాకు పెద్ద నష్టం కానుంది. రష్యా ఉక్రెయిన్‌పై యుద్ధం చేసి కాళ్లూచేతులు కాల్చుకుంటోంది. ఇప్పుడు అమెరికాదీ అదే పరిస్థితి. ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా ముజ్తబా ఖమేనీ

ప్రస్తుత హెచ్చరికలు అమెరికాకు గుణపాఠం కావాలి. అమెరికా, ఇజ్రాయెల్... ఇరాన్‌ల మధ్య యుద్ధం తీవ్రస్థాయి ప్రాదేశిక రాజకీయ సంక్షోభంగా మారింది. ఈ పోరు ఇతర గల్ఫ్ దేశాలకూ, సముద్ర రవాణా మార్గాలకూ, అంతర్జాతీయ ఇంధన మార్కెట్లకూ విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది. హర్మూజ్ జలసంధ వద్ద ఇరాన్ పట్టుతో ప్రపంచ దేశాలకు గమ్యం లేకుండా పోయింది. ఈ పరిస్థితిని అమెరికా అర్థం చేసుకునే స్థితిలో లేదు. ఇరాన్ అధినాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీని అమెరికా, ఇజ్రాయెల్‌లు హతమార్చడం ద్వారా ప్రత్యర్థి దేశపు బలాన్ని అంచనా వేయలేక పోయారు. అధినేతను తొలగిస్తే ఆ దేశాన్ని లొంగదీసుకోవాలన్న ఎత్తుగడలు దెబ్బతిన్నాయి. తమ అధినాయకుడి మరణం లేదా బలిదానం షియా వర్గాన్ని మరింత భీకర ప్రతిఘటనకు పురిగొల్పుతుంది. తమ అధినేత మరణం ప్రజల్లో ప్రతీకారేచ్ఛను పెంచుతుంది. దేశాన్ని బలహీనపరచే బదులు ప్రభుత్వానికి ప్రజల మద్దతును మరింత విస్తృతం చేస్తుంది. సైనిక దాడుల్లో సాధారణ పౌరులు మరణించడం ద్వారా అమెరికా తలనొప్పులు తెచ్చుకుంది. పలుప్రాంతాల్లో ప్రజాగ్రహాన్ని పెంచుతోంది. బాధితుల వివరాలు సామాజిక మాధ్యమాల్లో, పత్రికలూ టీవీ ఛానళ్లలో వేగంగా ప్రసారమవుతూ అంతర్జాతీయ ప్రజాభిప్రాయాన్నీ, దౌత్య సంబంధాలనూ ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు, తనపై అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడి దాడికి సహకరించిన ఇతర గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టింది. ఖతార్, బహ్రెయిన్, కువైట్ తదితరాలపైనా... ముఖ్యంగా అక్కడి అమెరికా సైనిక స్థావరాలపైనా డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. ఇరాన్ నేరుగా అమెరికా భూభాగంపై దాడి చేయలేక పోవచ్చు కానీ, పశ్చిమాసియాలోని అమెరికా సైనిక వసతులను కకావికలం చేయగలదు. అందుకనే గల్ఫ్ దేశాలు ఇప్పుడు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఇలా జరుగుతందని అమెరికా ఊహించకపోవడం కూడా యుద్ధ వైఫల్యంగానే భావించాలి. ఓ రకంగా ఇరాన్ తెలివిగా అమెరికాను దెబ్బతీస్తోంది. అనేక గల్ఫ్ దేశాలు తమ విధానాలకు అనుగుణంగా అగ్రరాజ్య స్థావరాలకు ఆతిథ్యమిస్తున్నాయి. ఈ స్థావరాలు పశ్చిమాసియా అంతటా నిఘా కార్యకలాపాలు, నౌకాదళ మోహరింపులు, యుద్ధ విమానాల ప్రయాణాలకు వీలుకల్పిస్తున్నాయి. ప్రస్తుత యుద్ధంలో ఈ స్థావరాలపై ఇరాన్ గురిపెట్టడం ద్వారా అమెరికాను దెబ్బ కొట్టడంలో కృతకృత్యమయ్యిందనే చెప్పాలి. అందుకే ఇరాన్‌పై దాడి ద్వారా అమెరికా సాధించింది సున్నాయే కాక, ఈ యుద్ధంలో విజేత ఇరాన్ అనే చెప్పాలి. ఈ క్రమంలో తటస్థంగా ఉండాలని భావించిన దేశాలు

కూడా ఇప్పుడు యుద్ధంలో ఇరుక్కుపోయే పరిస్థితి ఏర్పడింది. ఇంధన సరఫరా గొలుసులకు కేంద్రమైన పశ్చిమాసియా మొదటి నుంచీ అగ్రరాజ్యాల పోటీకి వేదికగా ఉంది. రష్యా, చైనాలకు ఇరాన్‌తో వ్యూహాత్మక సంబంధాలున్నాయి. అవి నేరుగా జోక్యం చేసుకోకున్నా–దౌత్య, ఆర్థిక మద్దతుతో ప్రభావితం చేస్తున్నాయి. హర్మూజ్ జలసంధి ఇరాన్ అదుపులో ఉండటం ఆ దేశానికి వ్యూహాత్మక బలంగా చూడాలి.

అదే తమ ట్రంప్ కార్డు అని ఇరాన్ నూతన అధినేత కూడా వ్యాఖ్యానించారు. ఇకపోతే గల్ఫ్ పరిణామాలు భారత దేశంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతున్నాయి. ఇండియా ముడి చమురు కోసం పశ్చిమాసియాపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. హర్మూజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలకు అంతరాయం కలగడంతో అది భారతదేశ ఇంధన భద్రతను, ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తోంది. అయితే ఇవన్నీ ఇప్పట్లో కలొఇక్కి వస్తాయని అనుకోవడానికి లేదు. ప్రత్యమ్నాయాలు చూసుకోవాల్సిందే.

## కూలిన అమెరికా ఈఫ్యూయలింగ్ విమానం

### ఇరాక్‌లో కూలినట్లు ప్రకటించిన అమెరికా

### తామే కూల్చామన్న ఇరాక్ రెబల్స్..తోసిపుచ్చిన అగ్రరాజ్యం

వాషింగ్టన్: అమెరికా వాయుసేనకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ–135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో గురువారం కుప్పకూలింది. అయితే ఈ ప్రమాదంలో ఎంతమంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారో అమెరికా అధికారులు ప్రకటించలేదు. సహాయ కార్యక్రమాలు చేపట్టినట్లు చెబుతున్నారు. ఈ ఘటనపై అమెరికా సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. రెండు సైనిక ట్యాంకర్ విమానాలు ల్యాండ్ అవుతుండగా ఈ ఘటన జరిగినట్లు వెల్లడించింది. రెండో విమానం సురక్షితంగా దిగినట్లు పేర్కొంది. మరోవైపు ఇరాక్‌కు చెందిన ఇస్లామిక్ రెసిస్టెన్స్ రెబల్ గ్రూప్ తామే అమెరికా విమానాన్ని కూల్చేసినట్లు ప్రకటించింది. ఈ గ్రూప్ ఇరాన్‌కు అనుకూలంగా పనిచేస్తోంది. ఆ సంస్థ అధికారిక టెలిగ్రామ్ ఛానెల్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే ఈ ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ తోసిపుచ్చింది. శత్రువుల దాడి లేదా ఫ్రెండ్లీ ఫైర్‌లో ఇది కూలిపోలేదని వెల్లడించింది. ఈ ఘటనలో ఆరుగురు సిబ్బంది చనిపోయినట్లు ఇరాన్ మీడియా చెబుతోందిద

. కేసీ–135 స్ట్రాటోట్యాంకర్‌లో కనీసం ముగ్గురు సిబ్బంది ఉండాల్సి ఉంటుంది.

వీరిలో పైలట్, కోపైలట్, ఆపరేటర్ ఉంటారు. వీరితోపాటు నేవిగేటర్, మిషన్ ఆధారంగా అదనపు సిబ్బందిని తరలిస్తుంటారు. ఇరాన్ యుద్ధంలో తీవ్రమైన పనిఒత్తిడి ఉన్న కార్యక్రమం విమానాలకు గాల్లో ఇంధనం నింపడమే. వందల సంఖ్యలో అమెరికా, ఇజ్రాయెల్ విమానాలు దాడులకు వెళుతుండటంతో ట్యాంకర్ విమానాల అవసరాలు గణనీయంగా పెరిగాయి.

# ఇంట్లోనే ఉగ్గు తయారు చేయండిలా..





మార్కెట్లో పిల్లల కోసం ఎన్నో రకాల ఉగ్గు ఉన్నాయి. ఇవి చాలా టేస్టీగా ఉంటాయి. కారణం ఇందులో ఎక్కువ శాతం చక్కెర ఉంటుంది. అయితే, పిల్లలకి వీటిని తినిపించడం వల్ల చిన్న తనం నుంచే వారికి మనకి తెలియకుండానే చక్కెర తినిపించినవారవుతాం. దీనిలో పోషకాల సంగతి పక్కన పెడితే ఈ ఉగ్గు కారణంగా ఎన్నో సమస్యలు వస్తాయి. అలా కాకుండా మనమే ఇంట్లోనే ఉగ్గుని తయారు చేయొచ్చు. ఎలానో తెలుసుకోండి.

మార్కెట్లో దొరికే ఉగ్గు.. ముందుగా చెప్పుకున్నట్లుగా మార్కెట్లో దొరికే ఉగ్గులో చాలా వరకూ పంచదార ఉంటుంది. దీంతో పిల్లలకి అధిక బరువు, మలబద్ధకం, దంతాల సమస్యలతో పాటు ఇతర సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, మీరే చక్కగా ఉగ్గు తయారు చేయొచ్చు. అదెలాగో తెలుసుకోండి.





కావాల్సిన పదార్థాలు.. ముందుగా ఓ కప్పు మిక్స్ గ్రెయిన్స్ తీసుకోండి. ఇందులో గోధుమలు, బియ్యం, బార్లీ, రాగులు ఉండేలా చూసుకోండి. వీటితో పాటు పప్పులు.. అందులో పొట్టుతో ఉండేలా చూసుకోండి. పెసలు, మినపప్పు, ఎర కందిపప్పు అన్నీ పొట్టుతో కలిపి అరకప్పు తీసుకోండి. వీలైతే వీటిని స్ప్రౌట్స్‌లా చేసి తీసుకుంటే మరీ మంచిది.

తయారీ విధానం.. ముందుగా ఈ పదార్థాలన్నీ కలిపి డ్రై రోస్ట్ చేయాలి. మెత్తని పిండిలా చేయాలి. ఈ పిండిని మొత్తం గాలి చొరబడని కంటెయినర్‌లో వేసి స్టోర్ చేయండి. ఇప్పుడు ఉగ్గు చేయాలనుకున్నప్పుడు ఓ గిన్నె తీసుకుని అందులో కొద్దిగా నెయ్యి వేసి పిండి వేసి రోస్ట్ చేయాలి. అందులోనే ఓ స్పూన్ పల్లీల పొడి, నువ్వుల పొడి వేసి నీరు పోసి ఉడికించాలి. మీకు ఇష్టమనుకుంటే అందులోనే పండ్లు కూడా వేయొచ్చు. అంతే చక్కని ఉగ్గు రెడీ.



పప్పులతో ప్రయోజనాలు.. పప్పులు అనే శక్తికి మారుపేరు అని చెప్పొచ్చు. పిల్లలు తల్లిపాలు మానేసి నప్పుడు పిల్లలకి కావాల్సిన శక్తి ఈ పప్పులు అందిస్తాయి. కారణం ఇందులో ప్రోటీన్స్, ఐరన్, విట మిన్స్, ఖనిజాలు, బయోయాక్టివ్ పదార్థాలు ఉండడమే.

తృణధాన్యాల ప్రయోజనాలు.. ఇక హోల్ గ్రెయిన్స్‌లో ఫైబర్, బి విటమిన్స్, జింక్, మెగ్నీషియం, మాంగనీస్‌లు ఉంటాయి. ఫైబర్ పిల్లల జీర్ణ వ్యవస్థని మెరుగ్గా చేస్తుంది. జింక్, మెగ్నీషియంలు ఇమ్యూనిటీని బలంగా చేస్తాయి. మాంగనీస్ పెరుగుదల, బ్రెయిన్ డెవలప్‌మెంట్‌కి హెల్ప్ చేస్తాయి.

# 5 లక్షణాలు ఉంటే కిడ్నీ ప్రాబ్లమ్స్ ఉన్నట్లేనట..



మన బాడీలో కిడ్నీలు చాలా కీ రోల్ పోషిస్తాయి. వీటిని జాగ్రత్తగా కాపాడుకోవడం చాలా ముఖ్యం. అయితే, కొన్ని చిన్న చిన్న లక్షణాలను మనం అస్సలు పట్టించుకోం. కానీ, అలాంటివే పెద్ద సమస్యలుగా మారతాయి. ఈ నేపథ్యంలోనే కిడ్నీ సమస్యల్ని మనం ముందుగా కాకుండా చాలా ఆలస్యంగా తెలుసుకుంటాం. ఈ కారణంగా చిన్న ప్రాబ్లమ్ కాస్తా డయాలసిస్, కిడ్నీ ఫెయిల్యూర్ వరకూ వెళ్తుంది.

కిడ్నీల ఆరోగ్యం.. మన బాడీలో కిడ్నీలు ఎన్నో పనులు నిర్వహిస్తుంది. ఇది రక్తాన్ని శుద్ధి చేసి బాడీలోని ఇతర ద్రవాలు, ఎలక్ట్రోలైట్స్‌ని బ్యాలెన్స్ చేయడానికి ద్రవ వ్యర్థాలను తొలగించడానికి హెల్ప్ చేస్తాయి. అలాంటి కిడ్నీలను జాగ్రత్తగా చూసుకోవాలి. కిడ్నీ సమస్యలు ఉంటే కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని గుర్తించడం చాలా ముఖ్యం. అలాంటి లక్షణాలు ఏంటో తెలుసుకోండి.

ఆకలి లేకపోవడం.. కిడ్నీ సమస్యలు ఉన్నప్పుడు, అవి సరిగ్గా పనిచేయనప్పుడు ఆకలి సరిగా ఉండదు. ఇది చాలా అధ్యయనాలు వెల్లడించాయి. కిడ్నీ సమస్యలు ఉన్నప్పుడు ఆకలిగా అనిపించదు. కాబట్టి, ఈ లక్షణాన్ని నిర్లక్ష్యం చేయొద్దు.

చర్మంపై దురద.. చర్మంపై దురద అనేది అనేక కారణాల వల్ల వస్తుంది. అయితే, కిడ్నీ సమస్యలు ఉన్నవారికి కూడా ఈ సమస్య ఉంటుంది. దీనిని కూడా గమనించాలి.

నిద్రలేమి.. మనకి హాయిగా నిద్ర పడుతుంటే శరీరంలో ఎలాంటి సమస్యలు లేనట్టే. కిడ్నీ సమస్యలు ఉంటే రాత్రి పూట సరిగ్గా నిద్రపట్టదు. మెలకువ వస్తుంటుంది. పగటి పూట ఎక్కువగా నిద్ర వస్తుంటుంది. కిడ్నీ సమస్యలు ఉంటే బాడీ పెయిన్స్, చిన్న పనికే అలసట వస్తుంటుంది. ఈ సమస్యలకి రెస్ట్ తీసుకుంటే సరిపోతుంది. బాడీ ఎప్పుడు అలసిపోతుంటే దానికి కిడ్నీ సమస్యలు కూడా ఓ కారణమవ్వొచ్చు.

మూత్రంలో మార్పు.. మూత్రంలో వచ్చే మార్పులని కూడా కిడ్నీ సమస్యల్ని గుర్తించొచ్చు. మూత్రం రంగులో మార్పు, వాసన చూసి కిడ్నీ సమస్యల్ని గుర్తించొచ్చు. ఇంతకు ముందు ఉన్నట్లుగా కాకుండా ముదురు రంగులో కాస్తా వాసన వస్తుంటే కిడ్నీల్లో ఏదో సమస్య ప్రారంభమైందని గుర్తించొచ్చు.

వీటిని గమనించండి.. అయితే, ఈ లక్షణాలన్నీ వేర్వేరు సమస్యల కారణంగా కూడా ఉండొచ్చు. కానీ, మీకు ఇలాంటి లక్షణాలన్నీ గమనిస్తే ముందుగా డాక్టర్స్‌ని సంప్రదిస్తే వారు మిమ్మల్ని పరీక్షించి ఏ సమస్య ఉందో క్లియర్‌గా చెప్పి సమస్య ముదరకుండా ఉంటుంది. కాబట్టి ముందుగానే డాక్టర్స్‌ని సంప్రదించండి.

# నిద్రపోతూ కూడా.. బరువు తగ్గొచ్చు..!




వ్యాయామం చేసి చెమటి చిందించి, కఠినమైన డైట్ ఫాలో అవుతూ, కేలరీలు తక్కువగా తీసుకుంటే మాత్రమే బరువు తగ్గుతామని చాలా మంది అనుకుంటూ ఉంటారు. అయితే, ప్రశాంతంగా నిద్రపోతూ కూడా బరువు తగ్గొచ్చని నిపుణులు అంటున్నారు. వెయిట్ లాస్ అవ్వడానికి హెల్తీ లైఫ్ స్టైల్, వ్యాయామం వంటి పద్ధతులు సహాయపడినప్పటికీ... శరీరంలోని అదనపు కొవ్వు కరిగించడానికి నిద్ర కూడా తోడ్పడుతుందని నిపుణులు అధ్యయనాలు సూచిస్తున్నారు. సాల్క్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన ఓ అధ్యయనం ప్రకారం ఇది స్పష్టమైంది. ఈ అధ్యయనంలో శాస్త్రవేత్తలు.. రోజుకు 14 గంటలు మేల్కొనే వ్యక్తులను 11 గంటలు మాత్రమే నిద్రపోవాలని సలహా ఇచ్చారు. 16 వారాల తర్వాత, వీ బరువులో 4 శాతం తగ్గినట్లు గుర్తించారు.

రాత్రిపూట.. తిండికి బాయ్ చెప్పొచ్చు.. మీరు పనిలో పడి, ఫ్రెండ్స్‌తో మాట్లాడుతూ అర్ధరాత్రి వరకూ మెలకువగా ఉంటున్నారా..? ఈ అలవాటు మీ సిర్కాడియన్ రిథమ్ లేదా శరీర – గడియారానికి భంగం కలిగిస్తుంది. ఇది, మన ఆకలి పెంచే గ్రెలిన్ హార్మోన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం జరిపిన ఒక అధ్యయనంలో ఇది తేలింది. ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకూ నిద్రపోయే వారు రాత్రి 11 నుండి ఉదయం 8 గంటల వరకు నిద్రపోయే సబ్జెక్ట్స్ కంటే 550 కేలరీలు ఎక్కువగా తీసుకుంటున్నట్లు గుర్తించారు.



నిద్రపోతున్నప్పుడు క్యాలరీలు బర్న్ అవుతాయి.. మన నిద్రలోనూ శరీరం శక్తిని ఖర్చు చేస్తుంది, కేలరీలను బర్న్ చేస్తుంది. నిద్రలో, ఒక వ్యక్తి గంటకు 65 కేలరీలు బర్న్ చేస్తాడు. అంటే 8 గంటల నిద్రలో 500కి పైగా కేలరీలు బర్న్ అవుతాయి. మీరు ఆ సమయాన్ని టీవీ చూస్తూ గడిపినట్లయితే, మీరు దాదాపు అదే మొత్తంలో కేలరీలు బర్న్ అవుతాయి. కానీ అలసిపోయిన్లు, శక్తి తగ్గినట్లు అనిపిస్తూ ఉంటుంది. చికాగో విశ్వవిద్యాలయం అధ్యయనం ప్రకారం, ప్రజలు బాగా విశ్రాంతి తీసుకుంటే కొవ్వు తగ్గుతుంది.



బాగా షాప్ చేస్తారు, తక్కువ తింటారు.. ఒబేసిటీ అనే మ్యాగజైన్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం, షాపింగ్‌కు వెళ్లినప్పుడు.. తక్కువ సేపు నిద్రపోయిన వారు.. ఎక్కువసేపు నిద్రపోయిన వారి కంటే.. 1300 ఎక్స్‌ట్రా కేలరీ ఫుడ్స్ కొన్నట్లు గుర్తించింది. ఇదొక్కటే కాదు, బాగా విశ్రాంతి తీసుకునే వ్యక్తులు తక్కువ నిద్రపోయే సబ్జెక్టుల కంటే కనీసం 35 కేలరీలు తక్కువగా ఉండే చిన్న పోర్షన్ పరిమాణాలను తినాలని ఎంచుకున్నారని మరొక ఆసక్తికరమైన పరిశోధన సూచించింది.

ఒత్తిడి తగ్గుతుంది.. ప్రశాంతమైన నిద్ర.. నిద్ర మీ వెంట్రోమీడియల్ ప్రిఫ్రంటల్ కార్టెక్స్‌ను నియంత్రించడానికి సహాయపడుతుంది. ఇది మీ ఒత్తిడి తగ్గించడానికి, మెదడు పనితీరు మెరుగుపరచడానికి సహాయపడుతుంది. హార్వర్డ్ మెడికల్ స్కూల్ నేతృత్వంలోని పరిశోధన ప్రకారం, నిద్ర లేమి ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్‌ను ప్రేరేపిస్తుంది, ఇది నేరుగా మన కొవ్వు నిల్వను పెంచుతుంది, ఇది అధిక బరువుకు కారణం అవుతుంది.



# పిండికి పురుగు పట్టకుండా ఉండాలంటే ఇలా చేయండి..





మనలో చాలా మంది పిండి తీసుకొచ్చి పెడతారు. అయితే, ఆ పిండికి పురుగు పట్టకుండా ఉండాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవేంటో తెలుసుకోండి. గోధుమపిండి, శనగ పిండి, జొన్న పిండి ఇలా చాలా పిండి పదార్థాలను మనం వంటలకి వాడతాం. ఇలా పిండి తీసుకొచ్చినప్పుడు కొన్ని రోజులకి అందులో పురుగులు పడుతుంటాయి. వాటిని అలానే వాడలేం. అందుకే, వాటిని వండే ముందు ప్రతి సారి శు భ్రం చేసి వాడుకోవాలి. అలా కాకుండా ఉండాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవేంటో తెలుసుకోండి.





జల్లెడ పట్టాలి..ముందుగా పిండిని వాడేటప్పుడు కచ్చితంగా జల్లెడ పట్టాలి. చిన్న సైజ్ ఉన్న జల్లెడతో జల్లించాలి. అప్పుడే అందులో ఉన్న కీటకాలు అన్ని పోతాయి. కాబట్టి, కచ్చితంగా జల్లెడ పెట్టాలి.


ఎండలో పెట్టడం.. మీరు ఈ పిండి పదార్థాలను ఎండలో పెట్టాలి. అప్పుడే అందులోనే చాలా పురుగులు బయటికొచ్చేస్తాయి. అయితే, వీటిని బయట పెట్టినప్పుడు ఎలాంటి క్రిములు రాకుండా చూసుకోవాలి.





ఫ్రిజ్‌లో.. మనం వాడే పిండిని ఎంత కావాలో తీసుకుని మిగతా పిండిని గాలి చొరబడని బ్యాగ్స్, డబ్బాల్లో పెట్టి ఫ్రీజర్‌లో పెట్టండి. దీని వల్ల అందులోకి పురుగు పట్టకుండా ఉంటాయి. అందులో పురుగులు ఉన్నా చనిపోతాయి. దీనిని జల్లెడ పడితే ఆ పురుగులు బయటికొచ్చేస్తాయి. పిండిని ఎప్పుడు గాలి చొరబడని డబ్బాలో పెట్టి స్టోర్ చేయాలి. అందులో బిర్యానీ ఆకులు, లవంగాలు పెట్టి స్టోర్ పెట్టొచ్చు.అదే విధంగా, ఎప్పటికప్పుడు అందులో వంట గదిలోని షెల్ఫ్‌లను క్లీన్ చేయండి.ఆఫర్‌లో వస్తుంది కదా అని ఎక్కువగా కొనకుండా తక్కువగా కొని వాడండి. ఎక్కువ రోజులు వాడకపోతే ఫ్రిజ్‌లో స్టోర్ చేయండి.

# బరువు తగ్గడానికి ఏది మంచిది..



వాకింగ్, యోగా.. బరువు తగ్గడానికి ఏది మంచిది.. వర్కౌట్ చేయడం ఇష్టం లేని వారు ఈజీగా చేసే వర్కౌట్స్‌లో వాకింగ్, యోగా కూడా ఉన్నాయి. వీటి వల్ల చాలా లాభాలు ఉన్నాయి. అయితే, ఈ రెండింటిలో బరువు తగ్గడానికి ఏది హెల్ప్ చేస్తాయో వారి ప్రాధాన్యతలు, ఫిట్‌నెస్ స్థాయిలు, మొత్తం గోల్స్‌తో సహా వివిధ అంశాలపై ఆధారపడి ఉంటాయి.





వాకింగ్.. వాకింగ్ అనేది చాలా ఈజీగా చేసే వర్కౌట్. ఇది హృదయ స్పందన రేటుని పెంచే మంచి ఏరోబిక్ వర్కౌట్, దీని వల్ల కొవ్వు కరుగుతుంది. బరువు తగ్గడానికి ఇది హెల్ప్ చేస్తుంది. బరువు తగ్గేందుకు బ్రిస్క్ వాకింగ్ ఎఫెక్టివ్‌గా ఉంటుంది. ఇది అన్ని వయసుల వారికి చాలా మంచిది. ఆరుబయట నడిస్తే రీఫ్రెషింగ్‌గా ఉంటుంది. మానసికంగా చాలా మంచిది. ఒత్తిడి తగ్గుతుంది. దీంతో బరువు తగ్గడానికి హెల్ప్ అవుతుంది.

యోగాతో బెనిఫిట్స్... బరువు తగ్గడంలో యోగా హెల్ప్ చేస్తుంది. అనేక భంగిమలు, శ్వాస పద్ధతులు సంపూర్ణంగా హెల్ప్ చేస్తాయి. ఇది బరువు తగ్గడానికి హెల్ప్ చేస్తాయి. ఒత్తిడిని తగ్గిస్తాయి. మంచి ఆసనాలు బలాన్ని పెంచి హృదయ స్పందన రేటుని పెంచుతాయి. కేలరీలను బర్న్ చేస్తాయి. బరువు తగ్గుతుంది.



ఏది ఎక్కువ కేలరీలను బర్న్ చేస్తుంది. కేలరీలను బర్న్ చేసే యోగా ఎక్కువ కేలరీలని బర్న్ చేస్తుంది. ఫిట్‌నెస్‌కి యోగా హెల్ప్ చేస్తుంది. దీని వల్ల బలం, ఫ్లెక్సిబిలిటీ, బ్యాలెన్స్‌ని పెంచుతుంది. బరువు తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి.

కండర ద్రవ్యరాశి పెరిగేకొద్దీ, శరీర జీవక్రియ పెరుగుతుంది. ఇది విశ్రాంతి సమయంలో కూడా క్యాలరీలు బర్న్ చేస్తాయి. వివిధ పోశ్చర్‌లలో కండరాల ఎంగేజ్ అయి బరువు తగ్గడంలో హెల్ప్ చేస్తాయి.

ఎక్కువగా ఏం పనిచేస్తుంది.. అయితే, లాంగ్ రన్‌లో వాకింగ్ రోజువారీ ఫిట్‌నెస్ జర్నీలో హెల్ప్ చేస్తుంది. అయితే, యోగా ఆసనాలు, ధ్యానం మనస్సు, శరీరం సరిగ్గా స్పందిచేలా చేస్తుంది. ఎక్కువ రోజులు యోగా చేస్తే చాలా లాభాలు ఉంటాయి. ఈ రెండూ కూడా బరువు తగ్గడంలో హెల్ప్ చేస్తాయి. మన శరీరానికి ఏది మంచిదో తెలుసుకుని ఆచరించడం వల్ల బెనిఫిట్స్ ఉంటాయి.





# అమెరికా, దక్షిణ కొరియాలకు కిమ్ వార్నింగ్

దాదాపు రెండేళ్లుగా రష్యా- ఉక్రెయిన్ దేశాల మధ్య భీకర యుద్ధం జరుగుతుంది. ఇంకో వైపు, గతేడాది అక్టోబరు నుంచి హమాస్ మిలిటెంట్లు-ఇజ్రాయెల్ సేనల మధ్య కూడా భీకర పోరాటం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలోనే ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ కూడా యుద్ధంపై ప్రకటన చేసినట్లుగా ప్రచారం జరుగుతుంది. దీంతో మూడో ప్రపంచ యుద్ధం అనివార్యంగా కనిపిస్తోంది. ఇప్పటికే ప్రపంచం తీవ్ర సంక్షోభంతో కొట్టిమిట్టాడుతుండగా.. యుద్ధాల వల్ల మరింత దిగజారిపోతోంది. దక్షిణ కొరియా, దాని మిత్రదేశం అమెరికాతో యుద్ధానికి సిద్ధంగా ఉండాలని సైన్యానికి ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ పిలుపునిచ్చారు. ఇకపై పొరుగు దేశంతో ఎటువంటి సయోధ్య, పునరేకీకరణ ప్రయత్నాలు ఉండబోవని ఉద్ఘాటించారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత దారుణంగా పతనమయ్యాయని, శత్రుదేశాల మాదిరిగా మారాయని కిమ్ వ్యాఖ్యానించినట్లు ఉత్తర కొరియా అధికారిక మీడియా కేసీఎన్ఏ వెల్లడించింది. ముఖ్యంగా అమెరికా రూపంలో వచ్చే ముప్పును పసిగట్టి ఉండాలని సైన్యాలకు ఆయన సూచించారు. ఒకవేళ యుద్ధానికి దిగితే వాటిని నాశనం చేయడానికి సిద్ధం కావాలని అన్నారు. కొత్త ఏడాదిని పురస్కరించుకుని సైనిక కమాండర్లతో నిర్వహించిన సమావేశంలో కిమ్ జోంగ్ ఉన్ మాట్లాడుతూ.. 'వాస్తవాన్ని గుర్తించి దక్షిణ కొరియాతో మన సంబంధాలపై స్పష్టతనివ్వాల్సిన సమయం వచ్చింది. ఒక వేళ అమెరికా, ద.కొరియాలు యుద్ధానికి ప్రయత్నిస్తే.. మన దగ్గర ఉన్న అణ్వాయుధాలను కూడా వినియోగానికి వెనుకాడబోం. మనల్ని ప్రధాన శత్రువుగా ప్రకటించి.. మా ప్రభుత్వాన్ని కూల్చేందుకు అవకాశం కోసం చూస్తున్న వారితో ఎటువంటి సంబంధాలు కొనసాగించం' అని స్పష్టం చేశారు. 2024 విధాన ఎజెండాను నిర్ణయించడానికి నిర్వహించిన ఈ సమావేశంలో ఉత్తర కొరియా అధినేత.. అమెరికా వివిధ మార్గాల్లో ముప్పును కలిగిస్తోందరని ఆరోపించారు. సాయుధ పోరాటాన్ని ప్రస్తావిస్తూ.. అనుకోని సంఘటన సంభవించినప్పుడు అణు బలగాలతో సహా అన్ని భౌతిక మార్గాలను సమీకరించే దక్షిణ కొరియా మొత్తం భూభాగాన్ని అణచివేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు, దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ సోమవారం మాట్లాడుతూ.. ప్యాంగ్‌యాంగ్ కవ్వింపులను కట్టడి చేయడానికి 2024 మొదటి అర్ధభాగంలో అమెరికాతో కలిసి ఉమ్మడి నిరోధక వ్యవస్థను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఇది ఏదైనా ఉత్తర కొరియా అణు, క్షిపణి ముప్పును ప్రాథమికంగా అడ్డుకుంటుందని యూన్ తన నూతన సంవత్సర దినోత్సవ ప్రసంగంలో అన్నారు. కాగా, 1953లో సైనిక ఘర్షణ తర్వాత కొరియా ద్వీపకల్పం ఉత్తర, దక్షిణ కొరియాలుగా విడిపోయింది. కానీ, అప్పట్లో యుద్ధ విరమణ ప్రకటన చేయలేదు. దీంతో సాంకేతికంగా రెండు దేశాల మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఇరు దేశాలు ఎప్పటికైనా విలీనం కావాలని లక్ష్యంగా పెట్టుకున్నా.. అది నెరవేరడం అసాధ్యంగా మారింది. కిమ్ అధికారం చేపట్టాక.. ఇవి పతాక స్థాయికి చేరాయి. కిమ్ తాజా ప్రకటనతో పునరేకీకరణ అసాధ్యమని తేలిపోయింది. భవిష్యత్తులో దక్షిణ కొరియా శాంతి ప్రతిపాదనలు చేసినా.. ప్యాంగ్‌యాంగ్ వాటిని తిరస్కరించడం ఖాయం. ఇది ఆసియాలో ఘర్షణలకు దారితీసే ప్రమాదం ఉంది. గత వారం కిమ్ జోంగ్ ఉన్ దేశంలోని ఆయుధ తయారీదారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అమెరికాతో ఎలాంటి ఘర్షణ తలెత్తినా.. తట్టుకొనేలా ఆయుధ తయారీని వేగవంతం చేయాలని సూచించినట్లు కేసీఎన్ఏ వెల్లడించింది. అమెరికా కారణంగా కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు పెరిగిపోయాయని ఆరోపించింది. 2023లో ఉత్తర కొరియా నిఘా ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. దేశ హోదాను రాజ్యాంగంలో అణుశక్తిగా పొందుపరిచింది. అత్యంత అధునాతన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించింది. అంతకు ముందు 2022లో తనను తాను తిరుగులేని అణుశక్తిగా ప్రకటించుకుంది. తన అణ్వాయుధ కార్యక్రమాన్ని ఎప్పటికీ వదులుకోదని పదేపదే నొక్కిచెప్పిన కిమ్.. పాలనలో తన మనుగడకు అవసరమైనదిగా స్పష్టం చేశారు.



# సునామీ హెచ్చరికలు జారీ

మహా సముద్రంలోని భూకంపాల జోన్‌లో ఉన్న ఇండోనేషియాలో ఆదివారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. ఇది రిక్టర్ స్కేల్‌పై 6.1 తీవ్రతగా నమోదయ్యింది. అయితే, దీనికంటే అతి శక్తివంతమైన భూకంపం జపాన్‌లో చోటుచేసుకుంది. 24 గంటల వ్యవధిలో సంభవించిన ఈ భూకంపం వల్ల జపాన్‌కు సునామీ ముప్పు ఉన్నట్టు నిపుణులు హెచ్చరికలు చేశారు. ముఖ్యమంగా పశ్చిమ తీరంలోని నగరాలకు ప్రమాదం పొంచి ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జపాన్‌లో కొత్త ఏడాది మొదటి రోజున భారీ భూకంపం సంభవించింది. ఉత్తర మధ్య జపాన్‌లో రిక్టర్ స్కేల్2పై సోమవారం 7.6 తీవ్రతతో భూకంపం చోటుచేసుకున్నట్టు ఆ దేశ అధికారిక మీడియా ఎన్‌హెచ్‌కే వెల్లడించింది. భూకంపంతో పశ్చిమ తీరానికి జపాన్ వాతావరణ విభాగం సునామీ హెచ్చరికలు జారీచేసింది. జపాన్ వాతావరణ సంస్థ పశ్చిమ తీర ప్రాంతాలైన ఇషికావా, నీగాటా, టొయామా ప్రిఫెక్చర్లకు సునామీ ముప్పు ఉందని హెచ్చరించింది. ఇషికావా ప్రిఫెక్చర్‌లోని నోటోలో సముద్రపు అలలు 5 మీటర్ల ఎత్తుకు చేరుకుంటాయని వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇషికావా ప్రిఫెక్చర్‌లోని వాజిమా నగరం తీరంపై సునామీ ప్రభావం ఇప్పటికే మొదలైందని, అలలు ఒక మీటరుకు పైగా ఎగిసిపడుతున్నాయని ఎన్‌హెచ్‌కే నివేదించింది. భూకంపం తర్వాత హొకురికు అణు విద్యుత్ కేంద్రంలో భద్రత, సమగ్రతను నిర్ధారించడానికి అధికారులు తనిఖీలను నిర్వహిస్తోంది. కాగా, 2011 మార్చిలో సంభవించిన భూకంపం కారణంగా ఫుకిషిమా దైచీలోని అణు విద్యుత్ కేంద్రంలో ప్రమాదం సంభవించింది. రియాక్టర్లు వేడెక్కి అణుధార్మికత ప్రమాదకర స్థాయికి చేరడంతో ప్లాంట్‌ను అతికష్టంతో మూసివేయాల్సి వచ్చింది. కాగా, తాజా భూకంప వల్ల జరిగిన ప్రాణ, ఆస్తి నష్టం గురించి ఇంకా ఎటువంటి నివేదికలు అందలేదు. భూకంప కేంద్రం సహా మిగతా వివరాలపై అధికారులు ఎటువంటి ప్రకటన చేయలేదు. మరోవైపు, ఇండోనేషియాలో భూకంపం సంభవించిన 24 గంటల్లోనే ఈ భూకంపం చోటుచేసుకుంది. ఆదివారం ఇండోనేషియా పపువా ప్రావిన్సుల రాజధాని జయపురాలోని ఉప జిల్లా అబేపురాకు ఈశాన్యంగా 162 కిలోమీటర్ల దూరంలో రిక్టర్ స్కేలుపై 6.5 తీవ్రతతో భూకంపం సంభవించినట్టు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. భూకంప కేంద్రరో 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్టు గుర్తించారు. ఈ భూకంపం వల్ల ఎలాంటి సునామీ ప్రమాదం లేదని ఇండోనేషియాలోని వాతావరణ కేంద్రం జియోఫిజికల్ ఏజెన్సీ తెలిపింది. కానీ, భూకంపం భూమిలో కేంద్రీకృతమై ఉన్నందున మరోసారి భూకంపం సంభవించే అవకాశం ఉందని జియోఫిజికల్ ఏజెన్సీ హెచ్చరికలు చేసింది. హెచ్చరించినట్టుగానే మర్నాడు జపాన్‌లో భూకంపం సంభవించింది. ఈ భూకంప సంఘటన మార్చి 11, 2011న ఈశాన్య జపాన్‌ను తాకిన వినాశకరమైన భూకంపం.. సునామీని గుర్తుచేస్తుంది. ఫుకుషిమాలో విస్తృతమైన విధ్వంసం, అణు విధ్వంసానికి దారితీసింది. ఆ విపత్తు చేదు జ్ఞాపకం ఇప్పటికీ చాలా మంది కళ్లముందు మెదలాడుతోంది. తక్షణ ప్రతిస్పందన ఆవశ్యకతను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తుంది. ఏదైనా విపత్కర పరిస్థితి ఎదురైతే.. నివాసితులు అధికారిక మార్గాల ద్వారా సమాచారం ఇవ్వాలని, అధికారులు జారీ చేసిన ఏవైనా భద్రతా సూచనలకు కట్టుబడి ఉండాలని సూచించారు

# హౌతీ రెబల్స్‌కు ఎదురుదెబ్బ..



గాజాపై ఇజ్రాయేల్ సైన్యం దాడులను కొనసాగిస్తుండటంతో హమాస్‌కు మద్దతుగా యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్.. ఇరాన్ సరిహద్దులు, ఎర్ర సముద్రంలో రెచ్చిపోతున్నారు. ఇజ్రాయేల్‌కు చెందిన నౌకలు, ఆ దేశానికి మద్దతుగా నిలిచిన వారి ఓడలను టార్గెట్ చేస్తున్నారు. తాజాగా, రెండు రోజుల కిందట డెన్మార్ నౌకపై క్షిపణి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో నౌకకు ఎటువంటి నష్టం జరగలేదు. కానీ, మళ్లీ ఆదివారం తెల్లవారుజామున నౌక హైజాక్‌కు ప్రయత్నించి విఫలమైనట్టు అధికారులు తెలిపారు.
గత కొద్ది రోజులుగా ఎర్రసముద్రంలో రవాణా నౌకలపై దాడులకు పాల్పడుతోన్న హౌతీ రెబల్స్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా నౌకాదళం జరిపిన హెలికాప్టర్ల దాడిలో 10 మంది హౌతీలు హతమయ్యారు. డెన్మార్క్ షిప్పింగ్ కార్పొరేషన్ మెర్స్ హంగ్‌జౌ వాణిజ్య నౌకను ఆదివారం హౌతీ రెబల్స్ హైజాక్ చేయడానికి ప్రయత్నించి, లో నాలుగు బోట్లలో దానికి సమీపంగా చేరుకున్నారు. ఈ క్రమంలో నౌక సిబ్బంది పంపిన సందేశాలతో అప్రమత్తమైన అమెరికా నేవీ.. హెలికాప్టర్లను రంగంలోకి దింపింది. బోట్లపై కాల్పులు జరిపి మూడింటిని ముంచేశారు. నాలుగోది అక్కడ నుంచి తప్పించుకొని వెళ్లిపోయింది.
స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు జరిగిన ఈ ఘటనలో 10 మంది హౌతీలు హతమయ్యారు. కాగా, ఈ సంఘటన తర్వాత ఓ ప్రకటన విడుదల చేసిన మెర్స్ సంస్థ.. ఎర్ర సముద్రంలో 48 గంటల పాటు తమ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఇక, శనివారం కూడా మెర్స్ రవాణా నౌకపై హౌతీలు క్షిపణులను ప్రయో గించారని.. వాటిని తాము తిప్పికొట్టామని, మళ్లీ ఆదివారం చిన్న బోట్లతో దాడికి ప్రయత్నించారని అమెరికా వెల్లడించింది. కాగా, ఈ ఘటనపై హౌతీ రెబల్స్ గ్రూప్ తీవ్రంగా స్పందించింది. ఎర్రసముద్రంలో అమెరికా సహా ఏ దేశం జోక్యం చేసుకున్నా పరిణామాలు దారుణంగా ఉంటాయని హెచ్చరించింది. నౌక సిబ్బంది హెచ్చరికలను పట్టించుకోకపోవడంతో తమ బృందం దాడికి పాల్పడిందని హౌతీల ప్రతినిధి తెలిపారు. తమ పడవలపై అమెరికా దళాలు ఎర్ర సముద్రంలో దాడి చేయడంతో 10 మంది చనిపోయారని ఆయన చెప్పారు. మరోవైపు, గాజాపై ఇజ్రాయేల్ దాడుల పరంపర కొనసాగుతుంది. గడిచిన 24 గంటల్లో 100 మంది మృతి చెందారని, 286 మంది గాయాలయ్యాయని గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. గాజాపై తాము చేస్తున్న యుద్ధం ఇప్పట్లో ఆగదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టం చేశారు. గతేడాది అక్టోబరు 7న హమాస్ జరిపిన మారణహోమానికి ప్రతీకారంగా ఇజ్రాయేల్ దాదాపు 3 నెలల నుంచి భీకర దాడులు కొనసాగిస్తోంది. ఈ దాడుల్లో సుమారు 22 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. హమాస్‌కు మద్దతుగా యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్.. గత నవంబరు నుంచి ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడ్డుతున్నారు. దీంతో ప్రధాన షిప్పింగ్ కంపెనీలను సూయజ్ కెనాల్ ద్వారా కాకుండా ఆఫ్రికా కేప్ ఆఫ్ గుడ్ హోప్ చుట్టూ సుదీర్ఘమైన, ఖరీదైన మార్గాన్ని ఎంచుకుంటున్నాయి. ఎర్ర సముద్రం సూయజ్ కెనాల్‌ను ఉపయోగించే నౌకలకు ప్రవేశ స్థానం. ఇది ప్రపంచ వాణిజ్యంలో 12%ని నిర్వహిస్తుంది. ఆసియా, ఐరోపా మధ్య వస్తువుల తరలింపుకు ముఖ్యమైనది.

# 217 సార్లు కోవిడ్ టీకా వేయించుకున్న 62 ఏళ్ల వ్యక్తి...

**కోవిడ్ టీకాలు దుష్ప్రభావాలకు కారణమవుతా యి. వీటిలో టీకా తీసుకున్నప్పుడు చేయి నొప్పి కలగడమనేది ఓ సాధారణ ప్రభావం. లేదంటే జ్వరం, అలసట, తలనొప్పి, కళ్లు తిరగడం వంటి లక్షణాలు ఉంటాయి. 'అతడి రోగనిరోధక వ్యవస్థ పనితీరును అంచనా వేయడానికి వివిధ గుర్తులను కూడా పరిశీలించారు. ఇందులో ప్రధానమైన రెండు కణ వ్యవస్థలు కణాలు, కణాలు ఉన్నాయి. హైపర్ వాక్సినేషన్ ద్వారా తరుచూ వైరస్‌కు గురికావడం రోగనిరోధకతను దెబ్బతీస్తుందనే ఆందోళనలకు విరుద్ధంగా అతడిలో కణాలు, కణాల ఉత్పత్తి పరిమాణాన్ని పెంచింది' అధ్యయనం కనుగొంది.**




నాలుగేళ్ల కిందట ప్రపంచంపై కరోనా మహమ్మారి దాడిచేసి లక్షల మంది ప్రాణాలను తీసింది. ఈ వైరస్ బారినపడి కోట్లాది మంది బాధితులయ్యారు. కోవిడ్-19ను అడ్డుకోడానికి యుద్ధ ప్రాతిపదికన అన్ని దేశాలు టీకాల కోసం ప్రయోగాలు మొదలుపెట్టాయి. క్లినికల్ ట్రయల్స్ నిర్వహించి, వ్యాక్సిన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. వ్యాక్సిన్లు రావడంతో జనం కుదుటపడ్డారు. కానీ, వీటి వల్ల కూడా దుష్ప్రభావాలు ఉన్నాయనే ప్రచారం కూడా సాగింది. కానీ, దీనికి విరుద్ధంగా ఓ వ్యక్తి 200 డోస్‌లు తీసుకున్నాడు.ప్రపంచానికి కంటిమీద కునుకులేకుండా చేసిన కరోనా మహమ్మారిని నిలువరించే టీకా అందుబాటులోకి రాగానే ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రెండు డోస్‌లు వేసుకుని, తరువాత బూస్టర్ డోసుపై చాలా చర్చ జరిగింది. కానీ, అయితే జర్మనీకి చెందిన ఓ వ్యక్తి ఏకంగా 2017సార్లు కోవిడ్-19 టీకా తీసుకున్నాడు. కేవలం 29 నెలల వ్యవధిలోనే ప్రయివేట్‌గా టీకా తీసుకున్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. పోనీ 62 ఏళ్ల అతడు క్లినికల్ ట్రయల్స్‌లో భాగంగా తీసుకున్నాడా? అంటే అదీకాదు. వైద్య సలహాలకు విరుద్ధంగా ఇలా చేసినట్టు ఈ కేసు గురించి ది లాన్సెట్ ఇన్ఫెక్టిసియస్ డిసీజెస్ జర్నల్ ప్రచురించింది. ఆయన తీసుకున్న 217 డోసుల్లో 134 అధికారిక వర్గాల ద్వారా తీసుకున్నట్టు ధ్రువీకరించారు. మిగతా 83 మాత్రం ఆయన తనకు తానుగా తీసుకున్నాడు.
అయితే, ఆయనకు ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలూ ఎదురు కాలేదని ఎర్లాంజెన్-న్యూరెంబర్గ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు చెప్పారు. 'ఈ విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్నాం' అని ఆ యూనివర్సిటీ మైక్రోబయాలజీ విభాగానికి చెందిన డాక్టర్ కిలియన్ స్కోబర్ పేర్కొన్నారు. "మేం ఆయనను వివిధ పరీక్షల కోసం ఎర్లాంజెన్ యూనివర్సిటీకి రప్పించాం.. ఆయన కూడా ఈ పరీక్షలు చేయించుకోవడానికి ఎంతో ఆసక్తి చూపారు. ఆయన నుంచి రక్తం, లాలాజల నమూనాలను సేకరించాం" అని డాక్టర్ కిలియన్ స్కోబర్ తెలిపారు.
వీటితోపాటు గతంలో ఆయన నుంచి వైద్య పరీక్షల కోసం తీసుకున్న గడ్డకట్టిన రక్త నమూనాలను పరీక్షించారు. "అధ్యయనం సమయంలో మరోసారి ఆయన టీకా తీసుకున్నప్పుడు కూడా మేం రక్త నమూనాలను సేకరించాం" అని చెప్పారు. "టీకాలకు రోగనిరోధక వ్యవస్థ ఎలా ప్రతిస్పందిస్తోందనే విషయాన్ని నిర్ధరించడానికి ఈ నమూనాలను ఉపయోగిస్తాం' అని తెలిపారు.
ఒక వ్యక్తికి 217 సార్లు టీకాలు ఇచ్చారనే విషయంపై మాగ్డెబర్గ్ నగర పబ్లిక్ ప్రాసిక్యూటర్ విచారణ ప్రారంభించారు. ఈ మేరకు ఆయన 130 సార్లు టీకాలు ఇచ్చినట్టుగా ఆధారాలు సేకరించారు. అయితే దీనిపై ఇప్పటిదాకా నేరాభియోగాలు నమోదు చేయలేదు. కోవిడ్ టీకాలు ఇన్ఫెక్షన్లకు కారణం కావు. కానీ వ్యాధులతో ఎలా పోరాడాలో శరీరానికి నేర్పుతాయి. అయినప్పటికీ, 'హైపర్ వాక్సినేషన్' నియమావళికి నేరుగా ఆపాదించవచ్చా? అనేది అస్పష్టంగా ఉందని పరిశోధకులు హెచ్చరించారు. అల్బెర్ట్ ఐన్‌స్టీన్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన మైక్రోబయాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎమిలీ హ్యాపీ మిల్లర్ మాట్లాడుతూ.. 'సరైన మార్గదర్శకాలను అనుసరించకుండా ఓ వ్యక్తి వందల సంఖ్యలో కోవిడ్ టీకాలు తీసుకోవడం అనేది చాలా అసాధారణ సంఘటన.. టీకా మొదటి మూడు డోస్‌లతో రక్షించిడం వల్ల బహుశా అతడు కోవిడ్ బారినపడకపోవచ్చు. అతని ప్రవర్తన గురించి కూడా మాకు ఏమీ తెలియదు.' అని అన్నారు. ఎంఆర్ఎన్ఏ టీకాలు శరీర కణాలకు వైరస్‌కు సంబంధించిన జెనెటిక్ కోడ్‌ను చూపేలా పనిచేస్తాయి. దీన్ని రోగనిరోధక వ్యవస్థ గుర్తించి కోవిడ్ మీద పోరాటం చేయడం ఎలాగో తెలుసుకుంటుంది. కానీ, పదేపదే టీకాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక వ్యవస్థలోని కొన్ని కణాలు క్రియాశీలతను కోల్పోతాయి. అయితే, ఆశ్చర్యకరంగా ఈ జర్మనీ వ్యక్తిలో అలాంటి లక్షణాలేవీ కనిపించలేదని పరిశోధకులు గుర్తించారు. దీంతోపాటు ఎప్పుడూ కరోనా బారినపడిన లక్షణాలను కూడా గుర్తించలేదు.
రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు తాము ఈ 'హైపర్ వ్యాక్సినేషన్' విధానాన్ని ఆమోదించబోమని పరిశోధకులు తెలిపారు. అయితే జర్మనీ వ్యక్తిపై జరిపిన అధ్యయనం ద్వారా ఎలాంటి తుది నిర్ణయానికీ రాలేకపోయారు గానీ, కొన్ని సూచనలు చేయగలిగారు. "తాజా పరిశోధనల ద్వారా సాధారణ టీకాలతో పాటు మూడు డోసుల వ్యాక్సినేషన్ అనేది ఆమోదనీయమైన విధానమే' అని యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. కోవిడ్ టీకాలు సాధారణంగా సమయానుకూలంగా ఇస్తారు. కానీ రోగనిరోధక వ్యవస్థ అతి బలహీనంగా ఉన్న కొంత మందికి ఇతర సమయాల్లో అవసరాన్ని బట్టి అదనపు డోసులు ఇవ్వాల్సి రావచ్చు. ఇలాంటి వారిని జాతీయ ఆరోగ్య సంస్థే సంప్రదించి, అర్హులను గుర్తిస్తుంది.
కోవిడ్ టీకాలు దుష్ప్రభావాలకు కారణమవుతాయి. వీటిలో టీకా తీసుకున్నప్పుడు చేయి నొప్పి కలగడమనేది ఓ సాధారణ ప్రభావం. లేదంటే జ్వరం, అలసట, తలనొప్పి, కళ్లు తిరగడం వంటి లక్షణాలు ఉంటాయి. 'అతడి రోగనిరోధక వ్యవస్థ పనితీరును అంచనా వేయడానికి వివిధ గుర్తులను కూడా పరిశీలించారు. ఇందులో ప్రధానమైన రెండు కణ వ్యవస్థలు కణాలు, కణాలు ఉన్నాయి. హైపర్‌వాక్సినేషన్ ద్వారా తరుచూ వైరస్‌కు గురికావడం రోగనిరోధకతను దెబ్బతీస్తుందనే ఆందోళనలకు విరుద్ధంగా అతడిలో కణాలు, కణాల ఉత్పత్తి పరిమాణాన్ని పెంచింది' అధ్యయనం కనుగొంది.

# 2035 నాటికి జాబిల్లిపై అణు విద్యుత్ కేంద్రం..


అంతరిక్ష రంగంలో అగ్రదేశాల మధ్య పోటీ తీవ్రతరం అవుతోంది. అయితే, ఇది ఎటువంటి అనర్థాలకు దారితీస్తుందోనని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో చంద్రుడిపై ఏకంగా అణు విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటుచేయడానికి రష్యా, చైనాలు సిద్ధమవుతున్నాయి. ఈ ప్రాజెక్టు ఇప్పటికే పట్టాలెక్కినట్టు ప్రకటన చేశాయి. ఇదే నిజమైతే చంద్రుడిపై 2035 నాటికి న్యూక్లియర్ పవర్ ప్లాంట్ సిద్ధమవుతుంది. గతేడాది రష్యా చేపట్టిన లూనా-25 మిషన్ విఫలమైన విషయం తెలిసిందే. చంద్రునిపై అన్వేషణలో మరో కీలక ముందడుగు పడింది. మనిషి శాశ్వత నివాస కలను వీలైనంత త్వరగా సాకారం చేయాలని రష్యా, చైనాలు భావిస్తున్నాయి. అందుకు అవసరమైన విద్యుత్ తయారీని సోలార్ ప్యానళ్లు తీర్చలేకపోవచ్చనే ఉద్దేశంతో ఏకంగా అణు విద్యుత్కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయానికి వచ్చాయి. అందుకోసం ఇప్పటికే సంయుక్త కార్యాచరణను ప్రారంభించాయి. ఈ నిర్మాణాన్ని 2033 నుంచి 2035లోపు పూర్తిచేయాలనే సంకల్పంతో ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఇప్పటికే మొదలైందని రష్యా అంతరిక్ష సంస్థ రోస్‌కాస్మోస్ చీఫ్ యూరీ బోరిసోవ్ వెల్లడించారు. అయితే, ఇది అనుకున్నంత సులువు కాబోదని యూరీ అంగీకరించారు. కాక పోతే, 'న్యూక్లియర్ స్పేస్ ఎనర్జీ రంగంలో రష్యాకు అపార నైపుణ్యం ఉంది.. ఈ ప్రాజెక్ట్‌కు ఇది బాగా ఉపయోగపడనుంది... మేం తలపెట్టిన ప్రాజెక్టు చంద్రునిపై మనిషి శాశ్వత ఆవాసం దిశగా కీలక ముందడుగు కానుంది. అక్కడ మున్ముందు ఎదురయ్యే ఇంధన అవసరాలు, డిమాండ్లను తీర్చేందుకు సోలార్ ప్యానళ్లు సరిపోవు... అణు విద్యుతే ఇందుకు సమర్థమైన ప్రత్యామ్నాయం. కాబట్టి బాగా ఆలోచించిన మీదట ఈ ప్రాజెక్టును ప్రారంభించాం' అని ఆయన వివరించారు. కానీ, చంద్రునిపై అణు విద్యుత్కేంద్రం ఏర్పాటు మాటల్లో చెప్పినంత సులువేమీ కాదు. ఇందుకోసం ఇప్పటికే ఓ కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు యూరీ వెల్లడించారు. తొలి దశలో మానవ ప్రమేయం లేకుండా చంద్రునిపై అణు ప్లాంటు స్థాపన ప్రయత్నాలు పూర్తి ఆటోమేటెడ్ పద్ధతిలో సాగుతాయి. ఇందుకోసం ప్రధానంగా రోబోల రంగంలోకి దింపి.. వాటి సాయంతో పని నడిపిస్తారు. స్పేస్ టగ్‌బోట్ పేరిట అణు విద్యుత్‌తో నడిచే వ్యోమనౌకను అభివృద్ధి చేసే యోచనలో రష్యా ఉంది. ఇందులో భారీ అణు రియాక్టర్‌తో పాటు హై పవర్ టర్బైన్లు కూడా ఉంటాయి. విద్యుత్కేంద్రం నిర్మాణానికి అవసరమైన సామగ్రిని చంద్రునిపైకి దాని ద్వారా పంపుతారు. నిర్మాణ క్రమంలో వెలువడే అంతరిక్ష వ్యర్థాలు తదితరాలను ఈ నౌక శుద్ధి చేస్తుంది. జాబిల్లిపై అణు విద్యుత్కేంద్రం నిర్మాణంలో ఇమిడి ఉన్న అనేక సాంకేతిక సమస్యలను అధిగమించడంలో రష్యా, చైనా తలమునకలయ్యాయి. కానీ, న్యూక్లియర్ పవర్ ప్లాంటును ఎప్పటికప్పుడు చల్లబరచడం అత్యంత కఠినమైన సవాళ్లతో కూడుకున్నది. గతేడాది, చంద్రుడిపై అన్వేషణకు రష్యా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లూనా 25 ప్రయోగం విఫలమైంది. వ్యోమనౌక దక్షిణ ధ్రువాన్ని చేరే క్రమంలో అదుపు తప్పి పేలిపోయింది. ఆ ఎదురుదెబ్బ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. అయినా, అణు కేంద్రం విషయంలో వెనక్కు తగ్గకూడదనే పట్టుదలగా ఉంది. చైనాతో కలిసి మానవసహిత జాబిల్లి యాత్ర, ఆ వెంటనే చంద్రునిపై శాశ్వత కేంద్రం ఏర్పాటు దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. చైనా కూడా 2030 నాటికల్లా తొలి వ్యోమగామిని చంద్రునిపైకి పంపడమే లక్ష్యంగా పెట్టుకుంది.

# ఎర్ర సముద్రంలో కార్గో నౌకపై హౌతీలు క్షిపణి దాడి..

గాజాలోని హమాస్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని గత అక్టోబరు 8 నుంచి ఇజ్రాయేల్ సైన్యాలు భీకర దాడులు చేస్తున్నాయి. తమ దేశంలోకి చొరబడి మారణహోమా న్ని సృష్టించిన హమాస్ ముష్కరులపై ప్రతీకారంతో ఇజ్రాయేల్ యుద్ధం సాగిస్తోంది. అటు, హమాస్‌కు మద్దతుగా పలు ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థలు.. ఇజ్రాయేల్, దాని మిత్ర దేశాల కార్యాల యాలు, నౌకలను లక్ష్యంగా చేసుకుంటున్న విషయం తెలిసిందే. ఎర్ర సముద్రంలో హౌతీ తిరుగుబాటుదారుల దాడులు రోజు రోజుకూ తీవ్రతరమవుతున్నాయి. కార్గో నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారు. తాజాగా, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో 'ట్రూ కాన్ఫిడెన్స్' కార్గో నౌకపై క్షిపణి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు సిబ్బంది చనిపోగా, మరో ఆరుగురు గాయపడ్డారు. నౌక కూడా దాడిలో దెబ్బతింది. ఈ విషయాన్ని అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారులు ధ్రువీకరించారు.
గాయపడినవారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిపారు. యెమెన్ నగరం ఎడెన్‌కు 90 కి.మీ దూరంలో స్థానిక కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 11.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బార్బడోస్ జెండా ఉన్న ఈ నౌక చైనా నుంచి సౌదీ అరేబియాలోని జెడ్డాకు వెళ్తున్నట్లు ట్రాకింగ్ డాటా వెల్లడించింది. గాజాపై ఇజ్రాయేల్ దాడులను వ్యతిరేకిస్తూ పాలస్తీనాకు మద్దతుగా గత నవంబరు నుంచి కార్గో నౌకలపై హౌతీ తిరుగుబాటుదారులు చేస్తున్న దాడుల్లో ప్రాణాలు కోల్పోవడం ఇదే మొదటిసారి. గ్రీస్ యాజమాన్యానికి చెందిన 'ట్రూ కాన్ఫిడెన్స్' కార్గో నౌక బార్బడోస్ జెండాతో వెళుతుండగా ఈ దాడి చోటుచేసుకుంది. దీంతో నౌకకు భారీ ఎత్తున నష్టం వాటిల్లినట్లు యాజమాన్యం తెలిపింది. అటు, హౌతీలు మాత్రం తమ హెచ్చరికలను నౌక సిబ్బంది పట్టించుకోలేదని ప్రకటన చేయడం గమనార్హం. ఈ ఘటనపై స్పందించిన యెమెన్‌లోని బ్రిటిష్ రాయబార కార్యాలయం... అమాయకులైన ముగ్గురు నౌకా సిబ్బంది చనిపోయారని, ఇది చాలా బాధకరమైన అంశమని పేర్కొంది. నౌకలపై పదే పదే హౌతీలు నిర్లక్ష్యపూరితంగా దాడులకు పాల్పడుతూ అంతర్జాతీయ వాణిజ్యానికి విఘాతం కలిగిస్తున్నారని మండిపడింది. ఇది వెంటనే ఆపాలని ఉద్ఘాటించింది. దాడి సమాచారం అందిన వెంటనే నౌక, సిబ్బందికి రక్షణగా అమెరికా నేతృత్వంలోని యుద్ధనౌకలు వెళ్లినట్లు సమాచారం.




# రణబాలి సెట్స్‌లోకి అడుగుపెట్టిన విజయ్ దేవరకొండ, రష్మిక




'రణబాలి' చిత్రంతో జంటగా ప్రేక్షకుల్ని అలరించనున్నారు విజయ్ దేవరకొండ – రష్మిక. వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న ఈ సినిమాని రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా కోసం విజయ్ – రష్మిక తిరిగి సెట్‌లోకి అడుగు పెట్టారు. ఈ ఇద్దరూ వైవాహిక బంధంలోకి అడుగు పెట్టాక కలిసి సెట్‌లోకి రావడం ఇదే తొలిసారి కావడంతో చిత్ర బృందం వారికి స్వాగతం పలికి.. కేక్ కట్ చేయించింది. 1854 – 1978 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నారు. విజయ్ దీంట్లో టైటిల్ పాత్ర పోషిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రలో రష్మిక నటిస్తోంది. ఈ సినిమా సెప్టెంబరు 11న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి సంగీతం: అజయ్ – అతుల్, ఛాయాగ్రహణం: నీరవ్ షా.

# బాలకృష్ణ, గోపీచంద్ కాంబో

### థమన్ మ్యూడిజక్ డైరెక్టర్‌గా ఫిక్స్

నటసింహం నందమూరి బాలకృష్ణ మరియు మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే అనౌన్స్‌మెంట్‌తోనే హైప్ క్రియేట్ చేసిన ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు మ్యూజిక్ పనులతో మరో అడుగు వేసింది. ఈ సినిమాకు సంగీత దర్శకుడు ఎస్.ఎస్. థమన్ ఇప్పటికే మ్యూజిక్ సిట్టింగ్స్ ప్రారంభించారు. తాజా సమాచారం ప్రకారం, రెండు ట్యూన్స్‌ను పూర్తిచేసిన థమన్, వాటిలో ఒక సాంగ్‌కి ప్రముఖ లిరిసిస్ట్ అనంత్ శ్రీరామ్‌తో పాట రాయించినట్టు తెలుస్తుంది. ఈ సాంగ్‌ను హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో గ్రాండ్‌గా చిత్రీకరించేందుకు ఎ÷–లాన్ చేస్తున్నారు. ఈ సాంగ్ షూట్ పూర్తయ్యిన వెంటనే అక్కడే ఒక కీలక యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా చిత్రీకరించనున్నట్లు సమాచారం. భారీ సెట్స్, విజువల్ గ్రాండియర్‌తో ఈ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాకు





సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో బాలకృష్ణను ఒక రాజుగా చూపించగా, హీరోయిన్‌గా నయనతార మహారాణి పాత్రలో కనిపించనున్నట్లు సంకేతాలు ఇచ్చారు. దీంతో ఇది ఒక పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇప్పటికే బాలయ్య?నయనతార కాంబినేషన్ ప్రేక్షకులను పలుమార్లు మెప్పించింది. వీరిద్దరూ కలిసి నటించిన సింహా, శ్రీరామ రాజ్యం, జై సింహా చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. ఇప్పుడు మరోసారి ఈ జోడీ తెరపై కనిపించనుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మాత సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం కథ, సెట్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేకంగా ఉండబోతున్నాయని టాక్ వినిపిస్తోంది.

## భరతవర్ష్ మూవీతో వస్తోన్న గోపీచంద్

యాక్షన్ హీరో గోపీచంద్ మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వరుస ఫ్లాప్స్ తర్వాత సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన ఈసారి పూర్తిగా భిన్నమైన కథతో 'భరతవర్ష' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో కొత్త సినిమాను ప్రకటించారు. టైటిల్ గ్లింప్స్ విడుదలయ్యాక సినిమా పై ఒక్కసారిగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా విడుదలైన గ్లింప్స్ వీడియోలో గోపీచంద్ యోధుడిగా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటూ యుద్ధరంగంలో విరుచుకుపడే సన్నివేశాలు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, యాక్షన్ ఎలిమెంట్స్ అన్నీ కలిసి సినిమా గ్రాండ్‌గా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నాయి. 'భరతవర్ష' అనే టైటిల్‌కు కూడా ప్రత్యేకమైన అర్థం ఉంది. పురాణాల ప్రకారం భరతవర్షం అంటే హిమాలయాల నుంచి సముద్రం వరకు విస్తరించిన



అఖండ భారతదేశాన్ని సూచిస్తుంది. చక్రవర్తి భరతుడి పేరుమీదుగా ఈ పేరు వచ్చినట్లు చరిత్ర చెబుతుంది. ఈ నేపథ్యంలో సినిమా దేశభక్తి, చరిత్ర, మైథాలజీ అంశాలను మేళవించి రూపొందుతున్నట్టు తెలుస్తోంది. ఇండిపెండెన్స్‌కు ముందు జరిగే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. కథలో మైథాలజీ టచ్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ కలయికతో సినిమా మరింత ఆసక్తికరంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో గోపీచంద్ సరసన రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందట. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారని, మేకర్స్ ఎక్కడా రాజీ పడటం లేదని తెలుస్తోంది. గోపీచంద్ కెరీర్‌లో ఇది ఒక టర్నింగ్ పాయింట్ మూవీ అవుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటివరకు వచ్చిన గ్లింప్స్, టైటిల్ ప్రభావం చూస్తే 'భరతవర్ష'తో ఆయన బలమైన కంబ్యాక్ ఇవ్వడం ఖాయం అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# కండలు పెంచి..కొత్త లుక్‌లో ఎన్టీఆర్

## డ్రాగన్ కోసం ఎన్టీఆర్ కసరత్తులు



జూనియర్ ఎన్టీఆర్ , స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న డ్రాగన్‌పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ న్యూ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. తాజాగా బయటకు వచ్చిన లుక్‌లో ఎన్టీఆర్ కండలు తిరిగిన దేహంతో, బీస్ట్ మోడ్‌లో కనిపిస్తున్నారు. సన్నని నడుముతో క్లాసిక్ బ్యాక్ డబుల్ బైసెప్స్ పోజ్‌లో ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవర్‌ఫుల్ యాక్షన్ పాత్ర కోసం ఎన్టీఆర్ కఠినమైన ట్రైనింగ్, ప్రత్యేక డైట్‌ను ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది. జిమ్‌లో ప్రాక్టీస్ చేస్తున్న ఫోటోను షేర్ చేస్తూ ఇది కష్టపడి తెచ్చుకున్న కండలు..కొన్నవి కావు.. అని ఆయన రాసిన క్యాప్షన్ కూడా వైరల్ అవుతోంది. ఇటీవల ఎన్టీఆర్ లుక్‌పై కొంత అసంతృప్తి ఏర్పడిందని, దాని వలన షూటింగ్ నిలిచిపోయిందంటూ ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. అయితే దీనిపై చిత్ర నిర్మాతలు స్పష్టత ఇచ్చారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఇది కేవలం రెగ్యులర్ షెడ్యూల్ బ్రేక్ మాత్రమేనని తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ అనుకున్న ప్రణాళిక ప్రకారమే కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే జోర్డాన్‌లో ఒక షెడ్యూల్ పూర్తయినట్లు సమాచారం. అలాగే హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ ప్రాంతంలో కూడా కీలక సన్నివేశాలు చిత్రీకరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఎన్టీఆర్‌పై యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించారని సమాచారం. తదుపరి షెడ్యూల్ కోసం భారీ సెట్స్ నిర్మాణం జరుగుతోంది. ఈ సినిమాలో విలన్ పాత్రపై కూడా ఆసక్తికర చర్చ నడుస్తోంది. తొలుత మలయాళ నటుడు టోవినో థామస్ ఈ పాత్రలో నటిస్తారని ప్రచారం జరిగింది. కానీ డేట్స్ సమస్యల కారణంగా ఆయన ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఈ కీలక పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ షాహిద్ కపూర్‌ని సంప్రదించే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు ఇండస్ట్రీ టాక్ వినిపిస్తోంది. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో హీరోయిన్‌గా రుక్మిణి వసంత్ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ త్వరలో రానున్నాయి. జూన్ 25న విడుదల చేయాలనే ప్రణాళికలో ఉన్నట్లు సమాచారం.

# ఏ పర్ఫెక్ట్ మ్యాచ్ సీరిస్

ఆకట్టుకుంటున్న సారా అర్జున్ –ఇషాన్ ఖట్టర్ ప్రస్తుతం సోషల్ మీడియా మొత్తం ఒకే జంట గురించి చర్చించుకుంటోంది. అదే సారా అర్జున్ –ఇషాన్ ఖట్టర్. వీరిద్దరూ కలిసి నటించిన మైక్రో సిరీస్ 'ఏ పర్ఫెక్ట్ మ్యాచ్' ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. కేవలం కొన్ని ఎపిసోడ్లతోనే ఈ జంట ఇంటర్నెట్‌లో మోస్ట్ ఫేవరెట్ జోడీగా మారిపోవడం విశేషం. ప్రముఖ దర్శకురాలు జోయా అక్తర్ సహకారంతో రూపొందిన ఈ సిరీస్‌లో ప్రేమకథను ఒక కొత్త కోణంలో చూపించారు. నిత్యజీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సంఘటనలను సెర్చ్ ఇంజిన్ కాన్సెప్ట్‌తో మేళవిస్తూ కథను నడిపించడం ఈ సిరీస్ ప్రత్యేకత. ఇప్పటివరకు విడుదలైన ఎపిసోడ్లు మంచి స్పందనను రాబట్టగా? ప్రతి ఎపిసోడ్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది. ముఖ్యంగా సారా –ఇషాన్




మధ్య ఉన్న నేచురల్ కెమిస్ట్రీ ఈ సిరీస్‌కు ప్రధాన బలం. సాధారణంగా కనిపించే మాస్ లేదా క్లిష్టమైన పాత్రల కంటే వీరి మధ్య ఉన్న ఫ్రెష్ వైబ్ ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేస్తోంది. వారి సంభాషణలు, భావోద్వేగాలు చాలా సహజంగా ఉండటంతో యూత్‌లో ఈ జంటకు మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఇక నెటిజన్లు అయితే ఈ జంటను పెద్ద తెరపై కూడా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. ఇద్దరూ కలిసి ఫుల్ లెంగ్త్ సినిమా చేస్తే బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ ఖాయం అంటూ కామెంట్లు చేస్తున్నారు. రొటీన్ జంటలతో పోలిస్తే వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం కొత్త తరహాలో ఉండటం కూడా ఈ క్రేజ్‌కు కారణంగా మారింది.ఇటీవల సారా అర్జున్ నటించిన 'ధురంధర్', ఇషాన్ ఖట్టర్ నటించిన 'హోమ్‌బౌండ్' సినిమాలు కూడా మంచి ప్రశంసలు అందుకోవడంతో ఈ ఇద్దరూ నవతరం నటులుగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఒకే ప్రాజెక్ట్‌లో కనిపించడం సినీ ప్రియులకు మరింత ఆనందాన్ని

# సమ్మర్‌లో మూడు కొత్త సినిమాలు

ఈ వేసవి వేడిలో ప్రేక్షకులకు కూల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించేందుకు టాలీవుడ్‌లో చిన్న సినిమాలు సిద్ధమవుతున్నాయి. విలేజ్ కామెడీ ఎంటర్‌టైనర్స్ నుంచి ప్రేమ కథల వరకు విభిన్న జానర్లతో థియేటర్లలో సందడి చేసేందుకు కొన్ని ఆసక్తికర చిత్రాలు ఏప్రిల్ మూడో వారంలో విడుదలకు రెడీ అయ్యాయి.యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నిర్మాతగా పరిచయం అవుతున్న తొలి చిత్రం తిమ్మరాజుపల్లి టివి. 90ల నాటి నేపథ్యంలో రూపొందిన ఈ విలేజ్ కామెడీ ఎంట్టంల్గ÷నర్ అప్పటి జీవనశైలిని, గ్రామీణ వాతావరణాన్ని గుర్తు చేసేలా ఉండబోతోంది. కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దాదాపు కొత్త నటీనటులతో ఈ సినిమాను తెరకెక్కించారు. సాయితేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతుండగా, దర్శకుడు వి. మునిరాజు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా ఏప్రిల్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. విభిన్న కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న హీరో తిరువీర్ నటిస్తున్న తాజా చిత్రం పాపం ప్రతాప్. ఈ సినిమాలో పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ జంట జీవితంలో కేవలం నాలుగు రోజుల్లోనే ఎదురయ్యే సమస్యల చుట్టూ కథ



తిరుగుతుందని సమాచారం. దర్శకుడు ఎస్పీ దుర్గా నరేశ్ తెరకెక్కించిన ఈ చిత్రంలో అజయ్ ఘోష్, రఘుబాబు, ప్రసాద్ బెహర వంటి నటులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా కూడా ఏప్రిల్ 17న విడుదల కానుంది. యువ హీరో నాగశౌర్య నటించిన 'బ్యాడ్ బాయ్ కార్తీక్' చిత్రం ఈ వారం ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు రామ్ దేశినా తెరకెక్కించిన ఈ యూత్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో హీరోయిన్‌గా విధి నటించింది. దాదాపు మూడు సంవత్సరాలుగా నిర్మాణంలో ఉన్న ఈ సినిమా చివరికి విడుదలకు సిద్ధమైంది. ఏప్రిల్ 17న థియేటర్లలో రిలీజ్ కానుండగా, యూత్ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అంశాలతో రూపొందిన ఈ మూవీపై మంచి అంచనాలు ఉన్నాయి. ఇదే రోజున 'తెరచాప' అనే మరో చిన్న సినిమా కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం పెద్ద సినిమాల మధ్య చిన్న సినిమాలకు అవకాశాలు తగ్గుతున్నప్పటికీ, మంచి కథ, సహజమైన నటన ఉంటే ప్రేక్షకులు ఆదరిస్తారని మేకర్స్ నమ్ముతున్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్, యూత్‌ను టా÷–గ్గ÷ట్ చేస్తూ ఈ సినిమాలు తెరకెక్కడం విశేషం. ఏప్రిల్ మూడో వారం థియేటర్లలో చిన్న సినిమాల సందడి మొదలవుతుండగా, వీటిలో ఏ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందో చూడాలి.

Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.